ఓం నమో భగవతే శ్రీ రమణాయ



# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి. వి. ఎల్. ఎన్. రాజు

సంపుటి : 28 సంచిక : 8 ఏప్రియల్ 2023

రమణ భాస్కర

ఆధ్యాత్మిక మాస పత్రిక

పేజీలు : 28

గౌరవ సంపాదకులు

శ్రీమతి P. H. V. సత్యవతి (హైమ)

చందా

సంవత్సర చందా:రూ॥ 150/-

విడి ప్రతి : రూ॥ 15/-

చిరునామా

రమణ భాస్కర

శ్రీ రమణ క్షేత్రం,

జిన్నూరు – 534 265

ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్

సద్గురు శ్రీ నాన్నగారు

శ్రీ రమణ క్షేత్రం

జిన్నూరు – 534 265

9441122622

7780639977

ప్రింటర్

శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్

(దుడే శ్రీను) ఎస్. వి. ఆర్. కాంప్లెక్స్,

పాలకొల్లు, 9848716747

డిజైనింగ్

అనన్య జిరాక్స్ & నెట్ సెంటర్

(నందిగామ శేషసాయి)

పి. పి. రోడ్డు, లజపతిరాయ్ పేట,

పాలకొల్లు, 9397151342

## ఈ సంచికలో. . . .

సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు ................ 2

సాధనకి సాధనాలు ........................................ 24


అక్షరమణమాల ........................................ 25

శ్రీమద్భగవద్గీత ........................................ 26

**ఇతర విషయములు :**

చావలి సూర్యనారాయణమూర్తి గారి వ్యాసం

సాగిరాజు రామకృష్ణంరాజు గారి వ్యాసం



ఈ దేహం ప్రపంచంలో ఉండగానే, అంటే నీ ముక్కులో గాలి తిరుగుతున్నప్పుడే, ఈ దేహాన్ని, ఈ ప్రపంచాన్ని ఉపయోగించుకొని నీ హృదయంలో అంతర్యామిగా ఉన్న పరమాత్మను దర్శించటమే ఈ దేహం యొక్క ప్రయోజనం, ఈ లోకం యొక్క ప్రయోజనం.

ఓం శ్రీనాన్న పరమాత్మనే నమః

# సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహభాషణములు - 13 అక్టోబర్ 1988, ఆలమూరు

సాధారణంగా మనం ఏమి అనుకుంటాం అంటే మనం గృహస్థాశ్రమంలో ఉన్నాము సాధన చేయగలమా, చేయలేమా? మనం తరించగలమా? అనుకుంటాము. భగవాన్ రమణగీతలో ఏమన్నారు అంటే గృహస్థాశ్రమంలో ఉండి కూడా తరించవచ్చు. వాళ్ళ పనులు వాళ్ళు చేసుకుంటూ ఈ ఆధ్యాత్మిక సాధన చేసుకుంటూ లోకానికి, సమాజానికి కూడా ఉపకారం చేసే అవకాశం గృహస్థాశ్రమంలో ఉంది అన్నారుస్వామి. అంటే గృహస్థాశ్రమం విడిచి పెట్టేసిన తరువాత ఇంకొక ఆశ్రమం మార్చుకుంటే మనం తరించవచ్చు అని భ్రాంతి పడవద్దు. ఈ గృహస్థాశ్రమంలోనే మీరు అందరూ తరించవచ్చు. మీరు సందేహం పెట్టుకోకండి. మీలో కొంతమంది రమణస్వామి భక్తులు ఉండవచ్చు, రాముడి భక్తులు కృష్ణుడు భక్తులు శివ భక్తులు యేసు క్రీస్తు భక్తులు ఉండవచ్చు. ఇలా రకరకాలుగా భక్తులు ఉండవచ్చు. సోదరమహాశయులారా! ఒకటి మటుకు మీరు జ్ఞాపకం ఉంచుకోండి, భగవంతుడిని తెలుసుకోవటం అంటే మిమ్మల్ని మీరు తెలుసుకోవటమే. మీకు రాముడిని తెలుసుకుందాం, రమణమహర్షిని తెలుసుకుందాం, సాయిబాబాని తెలుసుకుందాం, క్రిష్ణుడిని తెలుసుకుందాం అని అనిపిస్తుంది. కానీ అసలు గమ్యం అది కాదు. మిమ్మల్ని మీరు తెలుసుకోవటమే మోక్షం, అదే గమ్యం.

మీరు ఏ సాధన చేసినప్పటికీ మిమ్మల్ని మీరు తెలుసుకోవాలి. మిమ్మల్ని మీరు తెలుసుకోరు అనుకోండి, మీకు దేవుడు తెలిసినా అది మానసిక దృశ్యం. మీరు దేవుణ్ణి తెలుసుకోవాలి అంటే మిమ్మల్ని మీరు తెలుసుకోవాలి. మిమ్మల్ని మీరు తెలుసుకోలేక పోతే మీరు దేవుణ్ణి తెలుసుకోలేరు. మమ్మల్ని మేము తెలుసుకుంటాం మాకు కలిసి వచ్చేది ఏమిటి అని మీరు అడగవచ్చు. మీరు నిద్రలో ఎంత సుఖంగా ఉంటున్నారో, మీరు గాఢ నిద్రలో ఎంత సుఖంగా ఉన్నారో, మిమ్మల్ని మీరు తెలుసుకుంటే ఈ జాగ్రదావస్థలో కూడా అంత సుఖంగా ఉంటారు. నిద్రలో ఎవరికైనా ఏ బాధలు అయినా ఉన్నాయా? నిద్రలో ఎవరికీ బాధలు లేవు. నిద్రలో ఎంతో సుఖంగా ఉన్నారు, ఎంతో హాయిగా ఉన్నారు, ఎంతో శాంతిగా ఉన్నారు. మిమ్మల్ని మీరు తెలుసుకుంటే ఈ జాగ్రదావస్థలో కూడా అంత శాంతిగా ఉంటారు. అందుచేత మీరు ఏ మంత్రం పుచ్చుకోండి, ఏ దేవుణ్ణి ఆరాధించండి, ఏ గురువుని ఆరాధించండి ఇవన్నీ ఒకేచోటకి తీసుకెళ్ళతాయి. అది మిమ్మల్ని మీరు తెలుసుకోవటమే.

మీరు ఏ దేవుణ్ణి ఆరాధించినప్పటికీ, ఏ గురువును ఆరాధించినప్పటికీ, ఏ దేవతను ఆరాధించినప్పటికీ, ఏ విగ్రహాన్ని ఆరాధించినప్పటికీ మీరు ఎవరో మీకు తెలియకపోతే ఒకటి లేని సున్నకు ఎంత విలువో మీకు అంతే విలువ. ఉన్నది ఒక్కటే, అది ఎక్కడ ఉంది? ఆ చైతన్యవస్తువు, ఆత్మవస్తువు, సత్యవస్తువు, అది మన హృదయంలోనే ఉంది. దానికి వేరుగా మనం లేము. అది మనమై ఉన్నాము. అది గనుక మీకు తెలిస్తే అది మీ కడసారి జన్మ. అది తెలుసుకున్న వాడు మటుకే, అది అయ్యిన వాడు మటుకే, హృదయంలో ఉన్న వస్తువును దర్శించిన వాడు మటుకే, అద్వైత జ్ఞానాన్ని, అద్వైత సుఖాన్ని తెలుసుకున్న వాడు మటుకే, ఈ మాయ నుంచి బయట పడగలడు. ఈ దేవుణ్ణి ఆరాధించండి, ఈ మంత్రాలనే చదవండి, మీకు వస్తుంది లేకపోతే రాదు అనే ఇరుకు పద్ధతి నేను మీకు చెప్పటం లేదు.

మీకు ఎన్నో సంపదలు ఉన్నాయి, అన్నీ అనుకూల పరిస్థితులు ఉన్నాయి అనుకోండి అయినా మీ మనసుకి కుదురు లేదు అనుకోండి, మీ మనసుకి శాంతి లేదు అనుకోండి, మీకు మోక్షం లేదు. మీకు ఎన్ని ఉంటే ఏమి ప్రయోజనం? మనసుకి శాంతి లేనప్పడు, మనసుకి కుదురు లేనప్పడు వాటి వలన ప్రయోజనం లేదు. రమణమహర్షి గారు ఒక చక్కటి మాట అన్నారు మీరు ఇప్పడు అందరూ మోక్షంలో లేకపోతే, మీరు ప్రయత్నం చేయడం వల్లే మీకు మోక్షం వస్తే ఆ మోక్షం కోసం మీరు ప్రయత్నం చేయడం అనవసరం. మీరు అందరూ మోక్షంలో లేరు అనుకోండి మీరు చేసే పూజ వల్లో, మీరు చేసే జపం వల్లో, మీరు చేసే ధ్యానం వల్లో మోక్షం వస్తుంది అనుకోండి, మీరు చేసే ప్రయత్నం వల్ల మోక్షం వస్తుంది అనుకోండి, మనం అటువంటి మోక్షాన్ని పొందడం అనవసరం. మోక్షం ఇప్పడు కూడా ఉంది. అది సదా ఉంది, మీ హృదయంలో ఎప్పడూ ప్రకాశిస్తోంది. ఈ కాలం కూడా మనసు యొక్క, అహంకారం యొక్క కల్పితమే. కాలాన్ని చూసి మోహపడకండి.

శరీరం ఉన్నవాడికి లోకం, శరీరం లేనివాడికి లోకం లేదు. మనసు లేనివాడికి శరీరం లేదు, హృదయం లేని వాడికి మనసు లేదు. బాగా అర్థం చేసుకోండి తొందర పడకండి. నేరేడుమిల్లిలో ఒకడు ఉన్నాడు అనుకోండి, వాడి శరీరం పోయింది అనుకోండి, నేరేడుమిల్లి తోటి ఏమైనా పని ఉందా వాడికి? వాడికి కోటా బియ్యం కావాలా? శరీరం ఉన్నవాడికే లోకం తోటి పని. దేహం ఉన్నవాడికి లోకం. దేహం లేని వాడికి లోకం తోటి పని ఏముంది? ఇంటి తోటి పని ఏముంది? బట్టల తోటి పని ఏముంది? మనసు లేని వాడికి దేహం తోటి పని ఏముంది? నేను నేను అనే బుద్ధి అందరికి ఉంది. ఎంత

తెలివిగల వాడికి అయినా, ఎంత మొద్దు అబ్బాయికి అయినా ఈ నేను అనే బుద్ధి అందరికి ఉంది. ఇక్కడ లేనివాళ్ళు ఎవరు అయినా ఉన్నారా? ఎంత మొద్దు అబ్బాయి అయినా ఆ నేనుని ఒక దెబ్బ కొట్టండి వాడు తాచు పాములా లెగుస్తాడు. అంటే నేను అనే బుద్ధి అందరికి ఉంది. అది లేని వారు ఎవరు లేరు. నేను అనే బుద్ధి ఎక్కడ నుంచి వస్తుంది? హృదయంలోంచి వస్తుంది. నేను అనే బుద్దే మనం, అది హృదయంలోంచి వస్తుంది. హృదయంలోంచి మనసు వస్తుంది, మనసులోంచి శరీరం వస్తుంది. శరీరం ఉన్నవాడికి లోకం. అంటే ఎక్కడ నుంచి వచ్చింది? నీ హృదయం నుండే వచ్చింది.

భగవాన్‌ని ఒకసారి అడిగారు ఏవండి మీరు ఏదో చెబుతున్నారు. హృదయంలోనే ఆత్మ ఉంది అంటున్నారు. హృదయంలోనే దేవుడు ఉన్నాడు అంటున్నారు. బయట ఎవడైనా దేవుడు కనిపించినా వాడు నిజం కాదు. అది దృశ్యం, ఎవరికి దృశ్యం? లోకం ఏ విధంగా అయితే మనసుకు దృశ్యమో, ఆ కనిపించే దేవుడు కూడా మనసుకే దృశ్యం. ఆ దృశ్యం ఎప్పటికైనా అదృశ్యం అయిపోతుంది. కనిపించేది ఎప్పుడూ అలా కనిపిస్తూ కూర్చోదు, కనిపించకుండా పోతుంది అంటున్నారు. హృదయంలో శాంతి ఉంది అంటున్నారు, హృదయంలో ఆత్మ ఉంది అంటున్నారు. మీరు చెబుతున్నారు మాకు తెలుసుకోవాలి అని ఉంది. ప్రయత్నం చేస్తున్నాం కాని మాకు ఏమి తెలియటం లేదు అన్నారు ఒక పెద్ద మనిషి. మన సమస్య కూడా అదే, మనకి అందరికి తెలుసుకోవాలి అని ఉంది కాని మనకి తెలియటం లేదు. మనకు తెలుసుకోవాలి అని ఉంది, ఎవరిని తెలుసుకోవాలి అని ఉంది? నిన్ను నువ్వు తెలుసుకో అంటే ప్రతీవాడు కంగారు పడుతున్నాడు. వాడినే తెలుసుకోమంటున్నాం కానీ ఎదుటి వాడిని తెలుసుకోమంటున్నామా? రమణమహర్షి గారు మిమ్మల్ని ఎవరిని ఎదుటి వాడిని తెలుసుకోమని చెప్పటం లేదు. మిమ్మల్ని మీరు తెలుసుకోండి. మీ తెలివితేటల తోటి మిమ్మల్ని మీరు తెలుసుకోండి. కాని మీ తెలివితేటల తోటి ఎదుటి వాడిని తెలుసు కోవటానికి మీరు ప్రయత్నం చేస్తున్నారు, ఎదుటివాడిలోని వాసనలు తెలుసుకోవటానికి ప్రయత్నం చేస్తున్నారు. మీ తెలివి తేటలు ఖర్చు పెట్టి, మీ లోపాలు సరిదిద్దుకుని మిమ్మల్ని మీరు తెలుసుకోండి. మీ తెలివి తేటలు అలా ఖర్చు చేసుకోండి అంటున్నారు రమణస్వామి. ఎన్ని సార్లు ఆ బ్రహ్మాస్త్రం మా మీద విడిచి పెడతారు మిమ్మల్ని మీరు తెలుసుకోండి అని అంగీకరించాం. మాకు తెలుసుకోవాలి అని ఉంది కాని తెలుసుకోలేకపోతున్నాము అని అంటున్నారు.

అప్పుడు రమణమహర్షి గారు ఏమని చెప్పారు అంటే ప్రవాహంలో ఒకడు కొట్టుకు పోతున్నాడు నేను ప్రవాహంలో కొట్టుకు పోతున్నాను ఒడ్డుకు రావాలి అనే బుద్ధి పుట్టింది మనలాగా, అంటే మనకు తెలుసుకోవాలి అనే బుద్ధి పుట్టినట్టు. కానీ ఆ ఒడ్డున ఉన్న తుంటరి కుర్రవాళ్లు ఏమి చేస్తున్నారు అంటే పెద్ద పెద్ద రాళ్లు పుచ్చుకుని ఇతనిని కొడుతున్నారు. అతనికి ఒడ్డుకు రావాలని ఉంది ఈత వచ్చును కాని గట్టు మీద ఉన్న కుర్రవాళ్లు పెద్ద పెద్దరాళ్ళు పుచ్చుకుని కొడుతూ ఉంటే ఆ దెబ్బలు భరించలేక మళ్ళీ ప్రవాహంలోకి వెళ్ళిపోతున్నాడు. మన పరిస్థితి అలాగే ఉంది అన్నారు రమణమహర్షి. అంటే ఏమిటి ఇక్కడ, మనం కూడా వాడిలాగే మాయ ప్రవాహంలో కొట్టుకు పోతున్నాం, ఈ జనన మరణ చక్రంలో కొట్టుకు పోతున్నాం, వాడు గట్టుకు రావటానికి ప్రయత్నం చేసినట్లు మనం సాధన చేస్తున్నాం, ప్రయత్నం చేస్తున్నాం. మాయా ప్రవాహం నుండి ఒడ్డుకు రావాలి అని తిప్పలు పడుతున్నాం. కాని ఆ గట్టు మీద ఉన్న కుర్ర వాళ్ళు ఏ విధంగా అయితే ఒడ్డుకు వచ్చేవాణ్ణి రాళ్ళు పుచ్చుకుని కొడుతున్నారో, మనలో ఉన్న వాసనలు, మనలో ఉన్న సంస్కారాలు మనల్ని బాదుతున్నాయి ఆ హృదయంలోకి వెళ్ళనివ్వకుండా. హృదయంలోకి దిగటానికి ప్రయత్నం చేస్తున్నాం, మనలో ఉన్న సంస్కారాలే, మనలో ఉన్న వాసనలే, మనలో ఉన్న కోరికలే, మనలో ఉన్న కాంక్షలే, మనలో ఉన్న ఆదర్శాలే, మన హృదయంలోకి దిగకుండా రాళ్ళు పెట్టి కొట్టినట్టు మన ప్రయత్నాన్ని విఘ్నం చేస్తున్నాయి. అందుచేత మనం హృదయంలోకి దిగలేక పోతున్నాం అంటే దానికి మన కోరికలే కారణం, మన వాంఛలే కారణం, మన వాసనలే కారణం.

కౌరవులు, పాండవులు కథ మీరు చాలా మంది చదివి ఉంటారు. కౌరవులు, పాండవులకు పేచీలు, తగాదాలు ఎన్నో ఉండేవి. ధృతరాష్ట్రుడుకు ఎప్పుడూ నిరంతరం వాళ్ళ పేచీలు చూస్తుంటే అతనికి ఏదో ఒక దుఃఖం, అశాంతి ఉండేది. ఒకసారి ఆధ్యాత్మిక శాస్త్రం తెలుసుకోవాలి అని ఆయనకు అనిపించింది. అప్పడు విదురుడుని అడిగాడు నాకు తత్వశాస్త్రం వినాలని ఉంది అందుచేత ఎవడైనా మహాత్ముడిని తీసుకురమ్మన్నాడు. విదురుడు తన తపశ్శక్తి చేత, తన నిగ్రహబలం చేత మనసులో ప్రార్థించి తత్వశాస్త్రం



**భగవంతుడిని పొందటం కోసం నువ్వు చేస్తున్న పని సహకరించాలి. నువ్వు కూర్చున్నా నుంచున్నా నీ గమ్యం ఎవరు? దేవుడు మాత్రమే, అలా అనన్య భక్తి కలిగి ఉండాలి.**

చెప్పటానికి అర్హుడు అయినటువంటి బ్రహ్మ మానసపుత్రుడు అయినటువంటి సనత్సుజాతుడిని అక్కడ దర్శించేలా చేశాడు. ఎవరు? విదురుడు. ధృతరాష్ట్రుడు సనత్సుజాతుడిని అడిగిన ప్రశ్న ఏమిటంటే మరణం అనేది ఉందా? లేదా? దానికి సనత్సుజాతుడు ఏమి చెప్పాడు అంటే మరణం ఉంది, మరణం లేదు. దేహమాత్రుడిని నేను అనుకునే వాడికి అంటే ఈ శరీరం మాత్రమే నేను అనుకునే వాడికి మరణం ఉంది. మరణం లేని వస్తువు ప్రతీ వాడి హృదయంలో ఉంది. దానికి మరణం లేదు, అది ఆత్మ, అది చైతన్యం, అదే భగవంతుడు. అది మరణించదు, ఎందుకు మరణించదు? అది పుట్టలేదు కాబట్టి శరీరం పుట్టింది కాబట్టి శరీరం మరణిస్తుంది, ప్రతీ వాడి శరీరం మరణిస్తుంది. పుట్టినది మరణిస్తుంది, పుట్టుక లేనిది మరణించదు. శరీరం నేను అనుకునే వాడికి మరణం ఉంది, శరీరం జీవించి ఉండగానే, శరీరంలో ప్రాణం ఉండగానే ఆత్మను తెలుసుకున్నవాడు ఆత్మ అవుతాడు కాబట్టి ఆత్మకి మరణం లేదు కాబట్టి మరణం లేదు అన్నాడు. మరణించిన వాడు తప్పనిసరిగా జన్మిస్తాడు. మరణం లేని వాడికి జన్మ తోటి పని లేదు. అందుచేత ఈ శరీరం ఉండగానే, ఈ ప్రాణం ఉండగానే, నువ్వు మరణం లేని వస్తువును తెలుసుకుంటే మళ్ళీ నీకు మరణం లేదు మళ్ళీ జన్మకు నువ్వు రావక్కరలేదు. ప్రపంచంలో అన్నింటికంటే ఆశ్చర్యకరమైన విషయం ఒకటి చెప్ప ధర్మరాజా అని యతి అడిగాడు. అప్పడు ధర్మరాజు ఏమి చెప్పాడు అంటే, మన కళ్ళ ముందు అనేకమంది చచ్చిపోతారు, అనేక మంది శవాలు చూస్తాము కాని నేను మటుకు శాశ్వతంగా బ్రతికి ఉంటాను అనుకుంటాం. అంటే అనేక మందికి ప్రాణం పోవటం మీరు చూసినప్పటికీ, తను మటుకు శాశ్వతంగా ఇలాగే ఉండిపోవచ్చు, తనకేమి ఇబ్బంది లేదు అని అనుకుంటూ ఉంటాడు. ఈ లోకంలో అన్నింటికంటే ఆశ్చర్యకరమైనది ఇదే అన్నాడు ధర్మరాజు. ఆత్మను తెలుసుకోవటానికే ఈ నేను ఎవరు అనే ప్రశ్న. అయితే మనకి రోజు కోపం వస్తుంది. మీకు ఎవరికీ కోపం రావటం లేదా? కోపం వస్తుంది. కోపం వచ్చే ఈ నేను ఎవరు? నాకు చిరాకు వస్తుంది, చిరాకు వచ్చే ఈ నేను ఎవరు? నాకు ఇష్టం వస్తుంది, ఈ ఇష్టం వచ్చే నేను ఎవరు? నాకు కొంతమంది మీద అయిష్టం వస్తుంది, కొంత మందిని ప్రేమిస్తున్నాను, కొంత మందిని ద్వేషిస్తున్నాను. కొంత మందిని ద్వేషించే ఈ నేను ఎవరు? కొంత మందిని ప్రేమించే ఈ నేను ఎవరు? నాకు గొప్పలు కావాలి అనుకునే ఈ నేను ఎవరు? ఈ కామ క్రోధాలు, ఈ రాగ ద్వేషాలు కూడా పడి పాకులాడే ఈ నేను ఎవరు? మీ పేరు ఏమిటి అని మీరు ఎవరినైనా అడగండి, రామరాజు అంటారు. రామరాజు అంటే నేను నేను అనే నేనుకి పేరా? ఈ దేహానికి పేరా? నేనుకి పేరు ఉందా?

మనకి కోపం వస్తుంది, ఏ లడ్డో, రొట్టెముక్కో పెడితే ఆ కోపం మెల్లిగా తగ్గిపోతుంది. కూతురికి తల్లి మీద కోపం వస్తుంది అనుకోండి నాలుగు చీరలు పెడితే ఆ కోపం తగ్గిపోతుంది. అలాగే పిల్లలకి కూడా కోపం వస్తుంది అనుకోండి ఏదో ఒకటి బఠానీలో, శెనగలో ఆశ చూపించండి వాళ్లకి కోపం తగ్గుతుంది. ఈ కోపాలు, ద్వేషాలు తగ్గిపోతున్నాయి. ఇవి నిలబడే టికెట్లు కాదు. ఇదంతా సైన్సు, నేను మీకు చెప్పేది పురాణం కాదు, కథలు కాదు. మనకు పొద్దున్న అనేక భావాలు వస్తున్నాయి, మధ్యాహ్నం అనేక భావాలు వస్తున్నాయి. సాయంత్రం అనేక భావాలు వస్తున్నాయి. ఈ భావాలు వస్తున్నాయి, వెళ్ళిపోతున్నాయి. కాని నేను అనే తలంపు మటుకు కామన్‌గా ఉంటుంది మీరు గ్రహించండి. ఆదర్శాలు మారతాయి, ఆశయాలు మారతాయి, కోరికలు మారతాయి, ఆకాంక్షలు మారతాయి. కాని నేను అనే తలంపు మటుకు కామన్‌గా అలాగే ఉండిపోతుంది. కామన్‌గా ఉండే ఆ నేను అనే తలంపుని మీరు పట్టుకుని దాని మూలం తెలుసుకోండి. జాగ్రదావస్థలో మీరు ఉన్నంత సేపు మిమ్మల్ని పట్టుకునే ఉంటుంది. అది ఎక్కడ ఉందో, దాని పుట్టుక స్థానం ఏదో దాని గురించి మీరు అన్వేషించాలి. దాని గురించి వెతకాలి, దాని మూలం ఏంటో మీకు తెలియాలి. అప్పుడు దేవుడు ఎవరో మీకు తెలుస్తాడు.

సోదరమహాశయులారా! మన అందరికి సుఖం కావాలి, దేవుడు అక్కర్లేదు, జ్ఞానం అక్కర్లేదు, ఏమి అక్కర్లేదు సుఖం మటుకు అందరికి కావాలి. ఈ సుఖం కావాలి అంటే మనకు డబ్బు కావాలి అనుకొంటున్నాము. డబ్బు లేకపోతే సుఖం లేదు అనుకొంటున్నాము. డబ్బు సంపాదిస్తే సుఖం రాదు. డబ్బు వలన భోగం వస్తుంది. డబ్బు పెట్టి మనిషి దుఃఖాన్ని కొనుక్కోగలడు కాని సుఖాన్ని ఎవడు కొనలేడు. మనం ఏమి అనుకుంటాం అంటే డబ్బుతో సుఖాన్ని కొందాం అని మన ప్రయత్నం కాని మనం అందరం కొనుక్కునేది దుఃఖాన్ని కొనుక్కుంటున్నాం. డబ్బు పెట్టి భోగం అనుభవిస్తాం, భోగం అనుభవించే కొలది ఏమి అవుతుంది అంటే దుఃఖం మిగులుతుంది, చివరకు మన డబ్బు మన దుఃఖానికి కారణం అవుతుంది. నేను చెప్పే మాటలు మీకు చేదుగా ఉండవచ్చు కాని ఈ జన్మలో కాకపోయినా మరుసటి జన్మలో అయినా, మరుసటి జన్మలో కాకపోయినా తరువాతి జన్మలో అయినా ఎప్పుడొకప్పుడు మీకు పడుతుంది కదా అని నేను చెబుతున్నాను. అందుచేత నేను యొక్క మూలాన్ని, ఈ నేను యొక్క స్వరూపాన్ని, మీరు గృహస్థాశ్రమంలో ఉండి కూడా తెలుసుకోవచ్చు. మీరు అందరూ మోక్షంలోనే ఉన్నారు. మోక్షం యొక్క స్వరూపమే శాంతి.

మనకు చిరాకు వస్తూ ఉంటుంది, ఇంట్లో ఒకచోట పెట్టె వస్తువు ఇంకొక చోట

పెడుతూ ఉంటాం. దీనికి కారణం ఏమిటి అని ఆలోచించండి. ఇంట్లో ఉన్న వాళ్ళ మీద కోపమో, వీధిలో ఉన్న వాళ్ళ మీద కోపమో ఏదైనా కానీ మనలో ఉన్న కోపమే మనం సమస్థితిలో లేకపోవడానికి కారణం. ఒక సమస్థితిలో మనం ఉండలేకపోతున్నాం అంటే దానికి మనలో ఉన్న కోపమే కారణం. అందుచేత ఈ నేను ఎవరు నువ్వు తెలుసుకోటానికి మీరు భగవద్గీత చదవక్కరలేదు. ఉపనిషత్తులు చదవక్కరలేదు. అంటే చదవకూడదు అని కాదు ఈ నేను ఎవరో తెలుసుకోవటం ముఖ్యం. ఈ నేను ఎవరో తెలుసుకోటానికి మీకు మంత్రం సహాయం చేస్తుంటే మంత్రం జపం చేయండి, ఈ నేను ఎవరో తెలుసుకోటానికి మీకు భగవద్గీత పారాయణ సహాయం చేస్తుంటే భగవద్గీత చదవండి. ఈ నేను ఎవరో తెలుసుకోటానికి మీరు చేసే యాత్రలు సహాయం చేస్తుంటే యాత్రలు చేయండి, ఈ నేను ఎవరో తెలుసుకోటానికి మీరు చేసే ధర్మం సహకరిస్తూ ఉంటే ధర్మం చెయ్యండి, ఈ నేను ఎవరో తెలుసుకోవటానికి విగ్రహారాధన మీకు ఉపయోగపడుతుంటే విగ్రహారాధన చెయ్యండి. మీరు ఏమి చేసినప్పటికీ మీరు చేసే పనులు అన్నీ ఈ నేను ఎవడో తెలుసుకోటానికి సహకరిస్తూ ఉండాలి.

మీరు ఒక్క విషయం జ్ఞాపకం ఉంచుకోండి, ఇప్పుడు మనం చేసేది సత్సంగం. మనం ఏ అరుణాచల శివో, రామ నామమో, కృష్ణ నామమో చేస్తూ ఉంటాం అది సంకీర్తన. ఒకటి సత్సంగం, రెండు సంకీర్తన. ఈసత్సంగం, సంకీర్తన కూడా నేను ఎవరో తెలుసుకోవడానికి ఉపయోగపడతాయి. మీరు ఏ నామం అయితే చేస్తున్నారో, ఆ సంకీర్తన చేసేటప్పుడు మీ మనసు అక్కడ ఉండాలి. ప్రదర్శన కోసం కాదు సంకీర్తన. చేసే నామం మీద మనసు ఉండాలి. సత్సంగం సత్యాన్ని తెలుసుకోవటం కోసమే, ఈ సంకీర్తన సత్యాన్ని తెలుసుకోవడం కోసమే. మీరు చేసే సత్సంగం సత్యాన్ని తెలుసుకోవడానికి సహకరించకపోతే, సత్యాన్ని తెలుసుకోవడానికి మీరు చేసే సంకీర్తన సహకరించకపోతే ఒకటి లేని సున్న. వాటి వలన మీకు ఏమైనా పుణ్యం వస్తే రావచ్చు, అనుభవిస్తే అది పోతుంది. అసలు భారతీయ విద్య అంటేనే ఇది. భారతీయ విద్య అంటే ఏమిటంటే ఒకటి సత్యం రెండు శివం మూడు సుందరం. ఏదైతే సత్యమో అదే మంచితనం ఏదైతే మంచితనమో అదే సుందరం. మీరు చేసే పని సత్యంగా ఉండాలి, మంచితనంగా ఉండాలి, సుందరంగా ఉండాలి. సంకీర్తన అంటే సత్సంగం అంటే వీటి యొక్క ప్రయోజనం సత్యాన్ని తెలుసుకోవడం. ఆ సత్యం ఎవరు? నువ్వే. అది నీకు బయట లేదు. అది నీవు అయి ఉన్నావు. నువ్వు ఏ సత్యాన్ని అయితే తెలుసుకోవాలి అనుకుంటున్నావో అది నీకు వేరుగా లేదు, అది నీకు బాహ్యంగా లేదు.

బాహ్యంగా ఉన్న వస్తువును తెలుసుకుంటే అది నీకు సొంతం అవ్వదు. అది నువ్వే!

మన మనసులో ఉన్న గొప్ప విషయం ఏమిటంటే, బయట విషయాలు తెలుసుకోమంటే అది ఎంత దూరం అయినా పరుగెడుతుంది. అమెరికా వెళ్ళమంటే వెళ్ళిపోతుంది. ఏమి తెలుసుకోమన్నా తెలుసుకుంటుంది మనసు. కాని నిన్ను నువ్వు తెలుసుకో అని మన మనసుని అడిగితే అది తెలుసుకోదు. ఎందుచేత అంటే దానిని అది తెలుసుకోవటానికి ఎప్పుడైతే ప్రయత్నం మొదలు పెట్టిందో, ఆ ప్రయత్నం చేసేటప్పుడు, ఆ అన్వేషణ చేసేటప్పుడు ఇది రాలిపోవడం మొదలు అవుతుంది. అందుకు దాని జోలికి వెళ్ళదు. మనసు తోటి తెలుసుకోవలసింది నువ్వే. సత్యం నువ్వే, గుడ్‌నెస్ నువ్వే. నిన్ను నువ్వు తెలుసుకో అప్పుడు సత్యం ఏంటో తెలుస్తుంది, నీ సౌందర్యం ఏంటో తెలుస్తుంది. అంతకు మించి నువ్వు చేయవలసిన పని లేదు. సోదరమహాశయులారా! అద్వైత స్థితి పొందిన వాడికి, అద్వైత జ్ఞానం పొందిన వాడికి ఆనందం ఏమిటి? వాడు అన్నింటిని దాటి వెళ్ళిపోతాడు. నాకు ఆనందం కావాలి, నాకు శాంతి కావాలి అని అడిగేవాడు కూడా రాలిపోతాడు. మీరు మోక్షం కోసం ఎక్కడికివెళ్ళకండి. ఎప్పుడైతే మిమ్మల్ని మీరు తెలుసుకోవడం కోసం ప్రయత్నం చేస్తున్నారో, మీ హృదయం యొక్క లోతుల్లోకి మీరు ఎప్పుడైతే దిగుతున్నారో, మోక్షం వచ్చి మిమ్మల్ని వరిస్తుంది. జ్ఞానం సంపాదించాలి అంటే పని విడిచి పెట్టక్కర్లేదు. కర్తృత్వం లేకుండా, అహంకారం లేకుండా, పని చేసుకుంటూ ఉంటే అది పని కాదు పూజ. అహంకారం లేకుండా అన్నం తింటే అది అన్నం కాదు ప్రసాదం. లోకంలో ఉన్న అశాంతికి, లోకంలో ఉన్న దుఃఖానికి, లోకంలో ఉన్న గొడవలకి, లోకంలో ఉన్న నష్టాలకి, అన్నిటికి అహంకారమే కారణం.

సోదరమహాశయులారా! అహంకారం యొక్క మూలం తెలుసుకోవటం సామాన్యం కాదు. దీని మూలం తెలుసుకోవడం కోసం ఈశ్వర అనుగ్రహం ఉండాలి. ఈ అహంకారం అంత తొందరగా లొంగుతుందా? మీరు మేడలు కట్టొచ్చు, బ్రిడ్జిలు కట్టొచ్చు, వందలాది ఎకరాలు కొనవచ్చు, బ్యాంకు అకౌంటులు పెంచుకోవచ్చు. ఎన్ని పెంచుకున్నప్పటికీ నేను గొప్పవాడిని అని మీరు ఎవరు అనుకోవద్దు. మీరు ఎప్పుడు గొప్ప వారు అవుతారు అంటే, మీతోటి మీరు పోరాటం చేసి మీ అహంకారాన్ని మీరు జయిస్తే అప్పుడు మీరు గట్టెక్కినట్టు, అప్పుడు మీరు గొప్పవాళ్ళు అవుతారు. ఏనుగు నడుస్తుంటే కింద చీమలు పడి చచ్చిపోతూ ఉంటాయి. అబ్బా నేను ఎన్ని చీమలనిచంపాను అని ఏనుగు అనుకుంటుందా? ఏనుగు అనుకోదు. మీరు అహంకారం తోటి పోరాడి అహంకారాన్ని జయించండి. అప్పుడు మీ

గొప్పతనం తెలుస్తుంది. నేను ఆ భక్తుణ్ణి, ఈ భక్తుణ్ణి అని చెప్పిన వాళ్ళే కాని నా మనసు నా స్వాధీనంలో ఉంది. నా ఇంద్రియాలు నా స్వాధీనంలో ఉన్నాయి అని చెప్పేవాడు ఎవడు లేడు. ఎన్ని జన్మల నుండి దుఃఖ పడుతున్నానో ఈ దుఃఖానికి కారణం ఎక్కడో ఉంది అనుకున్నాను. ఎక్కడో బయట ఉంది అనుకున్నాను. ఈ దుఃఖానికి కారణం నా లోపలే ఉంది. నా మనసే నాదుఃఖానికి కారణం. నా మనస్సు యొక్క మూలం తెలిసాక తెలిసింది నాకు. ఈ మనస్సు వల్ల ఎంత దుఃఖ పడ్డానో, ఎన్ని జన్మలకు గురి అయ్యానో ఇప్పుడు దొరికాడు నాకు ఈ దొంగ, ఈ దొంగ ఎక్కడో బయట ఉన్నాడు అనుకున్నాను. ఈ దొంగ లోపలే ఉన్నాడు అన్నాడు జనక మహారాజు.

మీ తెలివితేటలు ఉపయోగించి రాముడు గొప్పవాడా, కృష్ణుడు గొప్పవాడా, శివుడు గొప్పవాడా, ఆ గురువు గొప్పవాడా, ఈ గురువు గొప్పవాడా అని అనవసరమైన గొడవలకి వెళ్ళి మీ కాలాన్ని పాడుచేసుకునే బదులు, మీ తెలివితేటలను మీరు బాగుపడటానికి ఎందుకు ఉపయోగించుకోరు. ఒకసారి నారదుడు విష్ణువుని అడిగాడు ఈ భూమి మీద ఎవరైనా ఒక భక్తుడు ఉన్నాడా అని అడిగాడు. విష్ణువు ఏమని చెప్పాడు అంటే ఉజ్జయిని నగరానికి దగ్గరలో ఒక పల్లెటూరిలో గోవిందదాసు అనే భక్తుడు ఉన్నాడు. అతనిని వెళ్ళి దర్శనం చెయ్యి, అతను నాకు భక్తుడు అన్నాడు. నారదుడు ఒక బాటసారిగా గోవిందదాసు దగ్గరకు వెళ్ళాడు. ఇంటి దగ్గరకు వెళ్ళి చూసేటప్పటికి అంతా మన ఇళ్ళలో జరిగే గొడవే. ఈ గోవింద దాసు మీద భార్య చిరాకు పడుతోంది. ఎందుకు? టైముకి పాలు తీసుకు రాలేదు, లేకపోతే బియ్యం తేలేదు ఏదో ఒక గొడవ ఉంటుంది కదా, ప్రతీ సంసారానికి ఏదో ఒక గొడవ ఉంటుంది. భార్య చిరాకు పడుతుంటే ఇతను చిరాకు పడుతున్నాడు. ఇలా చిరాకు పడుతున్నాడు వీడా భక్తుడు అనుకున్నాడు. ఏదో విష్ణువు చాలా గొప్ప భక్తుడు అని చెప్పాడే ఇతని పేరు. మనిషి అన్న తర్వాత పొరపాటు పడతాడు అలా దేవుడు కూడా పొరపాటు పడ్డాడా అనుకున్నాడు? ఒక మనిషి ఎప్పుడైనా పొరపాటు చేయొచ్చు కాని వెంటనే గ్రహించి ఆ పొరపాటుని సరిదిద్దుకోవాలి అది తెలివైన వాడి యొక్క లక్షణం. చేసిన పొరపాటు

**మనోదేహములతో తాదాప్యం వదులుకున్నప్పుడు**
**నీ హృదయంలో ఉన్న శాంతి సముద్రం పొంగి**
**నీ సహస్రారాన్ని ముంచుతుంది.**



మళ్ళీ జరగకుండా చూసుకోవాలి. పశ్చాత్తాప పడాలి అది మానవ ధర్మం.

ఇక్కడ ఏమి అనుకుంటున్నాడు నారదుడు? దేవుడు కూడా పరాకుగా ఉండి నాకు wrong address ఇచ్చాడు అనుకుంటున్నాడు. భార్యేమో భర్త మీద చిరాకు పడుతోంది, భర్త ఏమో భార్య మీద చిరాకు పడుతున్నాడు. వీడు మామూలు భక్తుడు కాదు కదా, గోవిందదాసు మహా భక్తుడు అని చెప్పాడు కదా అయితే అడ్రస్ పొరపాటు పడి ఉంటాడు విష్ణువు, వెనక్కి వెళ్ళిపోతే బాగుండును అనుకుంటాడు. దేవుడు అబద్ధం చెప్పడే. అయినా చూద్దాం ఏదో భార్యభర్తల దెబ్బలాటలు వచ్చాయి. అందుచేత వీడు భక్తుడు కాదు అని మనం బయటకు పోకూడదు. అని అప్పడు నారదుడు ఏమి చేశాడు అంటే దూర ప్రయాణం చేశాను మీ ఇంటి దగ్గర ఒకరోజు ఉండమంటే ఉంటాను అంటే ఉండవయ్యా అన్నాడు గోవిందదాసు. ఒక పది నిమిషాలు కూర్చొన్నాడు తరువాత పొలం వెళదాం రండి అన్నాడు. పొలం వెళ్ళారు, పొలం వెళితే అక్కడ పాలేరు, దూడలు, మాములు గొడవే, కాని గోవిందదాసు ఏమి చేస్తున్నాడు? ఇరవై నాలుగు గంటలలో నారాయణ, నారాయణ, నారాయణ అని మూడు సార్లు భగవంతుడిని స్మరించాడు. అప్పడు నారదుడు ఒక నిర్ణయానికి వచ్చాడు. భగవంతుడు చెప్పింది అబద్ధం. నాకు ఇతనిలో భక్తి ఏమీ కనపడలేదు. చాలా కష్ట పడి పని చేస్తున్నాడు. కష్ట జీవి, శ్రామికుడు కాని భక్తుడు అంటాడేమిటి? అనుకొని గోవిందదాసు దగ్గర సెలవు తీసుకుని తిరిగి వచ్చి విష్ణువుతో ఏమని చెప్పాడు అంటే "ఏమండీ అతను భక్తుడిగా నాకు ఏమి కనపడలేదు. ఏదో శ్రామికుడిగా కనిపించాడు. దూడలను జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. సంసారం జాగ్రత్తగా చూసుకుంటున్నాడు. ప్రతీ కుటుంబానికి ఉండే పేచీలు అక్కడా కనిపించాయి నాకు, అందుకని నాకు ఏమి ప్రత్యేకంగా కనపడలేదు. పైగా మీరు భక్తుడు అని చెప్పారు అన్నాడు. విష్ణువు ఏమి చేశాడు అంటే, ఒక కప్పు నిండా ఆయిల్ పోసి నారదుడు దగ్గరకు పట్టుకెళ్ళి, నువ్వు ఈ కప్పులో ఉన్న ఆయిల్ ఒక చుక్క కూడా కింద పడకుండా మేరు పర్వతం మీద పెట్టిరా. అయితే నువ్వు ఎలా వెళతావు? మాములుగా నువ్వు దేవఋషివి కాబట్టి గాల్లో ఎగిరిపోవడం కాదు. గోవిందదాసు ఇంటి దగ్గర ఎలా కష్టపడి పని చేసుకుంటున్నాడో అలా నువ్వు మానవుడి లాగా నడిచి వెళ్ళు. షరతు ఏమిటంటే ఇందులో ఒక చుక్క కూడా కింద పడకూడదు అని చెప్పాడు. అప్పడు నారదుడు మంచి ఏకాగ్రత తోటి మనసు అటుఇటు చెదరనివ్వకుండా జాగ్రత్తగా ఒక్క చుక్క కూడా కింద పడకుండా వెళ్ళి మేరు పర్వతం మీద పెట్టి, విష్ణువు దగ్గరకు తిరిగి వచ్చాడు. మీరు చెప్పిన పని నేను చేశాను. ఒక్క చుక్క కూడా కింద పడనివ్వలేదు. నేను

సక్సెస్ అయ్యాను అన్నాడు. రైటే నువ్వు కష్టపడి పట్టుకెళ్లావు, అక్కడ పెట్టావు. నువ్వు ఈ గిన్నెపట్టుకెళ్ళి ఆ మేరు పర్వతం మీద పెట్టే ఈ ప్రయత్నంలో ఎప్పుడైనా నన్ను స్మరించావా ఒక్కసారైనా? అని అడిగాడు. మిమ్మల్ని మటుకు స్మరించలేదు, నా బుద్ధి, నా మనసు అంతా ఆయిల్ కింద పడకూడదు అని ఉంది అన్నాడు. అప్పుడు విష్ణువు అన్నాడు ఏమయ్యా, ఈ ఆయిల్ గిన్నె అక్కడ పెట్టి రమ్మంటే నీ బుద్ధి అంతా దానిమీద పెట్టేసి నన్ను ఒక్కసారి కూడా స్మరించలేదు నువ్వు, ఇంత సంసార బాధ్యతలు మోస్తూ కూడా రోజుకి ఇరవై నాలుగు గంటలలో 3సార్లు నన్ను స్మరించాడు గోవిందదాసు అని చెప్పావు. ఇప్పుడు నువ్వు భక్తుడా? వాడు భక్తుడా? అని విష్ణువు అడిగాడు. ఇంతకీ మీకు ఈ విషయం ఎందుకు చెబుతున్నాను అంటే మీరు సంసారంలో ఉండి కూడా భగవంతుడిని అప్పుడప్పుడు మీరు స్మరించుకుంటు న్నప్పటికీ, మెకానికల్‌గా కాకుండా భక్తి తోటి, ప్రేమ తోటి, ఆప్యాయత తోటి, నిండు మనసు తోటి ఈశ్వరుడి నామాలలో ఏ నామం అయినా సరే మీరు ప్రీతి తోటి కనీసం రోజుకి నాలుగు సార్లు అయినా సరే స్మరించండి. మీకు మంచి మార్కులు పడతాయి. మీరు తొందర పడకండి మీకు ఏ కోరికలు కావాలి అన్నా నెరవేరతాయి. మీరు చేసుకునే జపాల వల్లో, ధ్యానాలవల్లో మీ కోరికలు నెరవేరతాయి కాని మీ గమ్యం అవి కాదు. సత్యాన్ని తెలుసుకోవడం, ఆత్మని తెలుసుకోవడం, భగవంతుడిని తెలుసుకోవటం, అది మీ గమ్యం.

శరీరం స్వప్నం, వ్యావహారిక జగత్తు అంతా కూడా స్వప్నం. ఇది మనకి నిజంగా కనిపిస్తోందా, అబద్ధంగా కనిపిస్తోందా? శాస్త్రాలు అబద్ధం అనిచెబుతాయి. కాని మనకి ఎలా కనిపిస్తోంది? నిజంగానే కనిపిస్తోంది. లోకం మనకి నిజంగానే కనిపిస్తుంది. మనుషులు నిజంగానే కనిపిస్తున్నారు. చచ్చిపోవటాలు నిజంగానే కనిపిస్తున్నాయి. పుట్టటాలు నిజం అనిపిస్తుంది. లోకంలో జరిగే గొడవలు అన్నీ కూడా నిజంగానే కనిపిస్తున్నాయి. కాని శాస్త్రం ఏమి చెబుతోంది అంటే మన శరీరం అబద్ధం అని, లోకం అబద్ధం అని, వ్యావహారిక జగత్తు అంతా అబద్ధం అని, ఇదంతా నిజం కాదు అని చెపుతోంది. కాని ఒక్క విషయం మీరు మనసులో పెట్టుకోండి. ఏదో ఒక నిజం ఉంది ఆ నిజం మన హృదయంలోనే ఉంది. ఏదో ఒక నిజం ఉంది కాబట్టి నిజం కానిది కూడా నిజం కింద కనిపిస్తోంది మనకి. ఇక్కడ ఈ మైక్ ఉంది, అది చీకట్లో మీకు దుంగ కింద కనిపించవచ్చు. ఇది దుంగ కాదు మైకే. ఏదో ఒకటి ఉంది కాబట్టి మీకు దుంగ కింద కనిపించింది. ఏదో ఒకటి లేదు అనుకోండి అసలు దుంగే కనపడదు. అదే విధంగా వస్తువు ఒకటి ఉంది, దానిని పరమాత్మ అనండి, ఆత్మ అనండి, దేవుడు అనండి, స్వర్గ రాజ్యం అనండి, మోక్షం

అనండి, ఏదో ఒక నిజం ఉంది అక్కడ, మనకు కనిపించేది అంతా నిజం కాదు. ఏదో ఒక నిజం ఉంది కాబట్టి ఇదంతా నిజం కింద కనిపిస్తోంది. ఏదైతే నిజమో అది మీ హృదయంలోనే ఉంది. ఆ నిజం మీకు అనుభవంలోకి వచ్చినప్పుడు తెలుస్తుంది అందులో సుఖం ఏముందో, దానిని తెలుసుకోటానికి మనం చేయాల్సింది ఏమిటి? నామం చెయ్యాలి, నామం మీద మనకు విశ్వాసం ఉండాలి.

గాలివాన వచ్చినప్పుడు మీరు ఎవరైనా తాటాకు ఇంట్లో ఉంటే తప్పనిసరిగా భయం వేస్తుంది. ఆ తాటాకు ఇల్లు కూలిపోతుంది ఏమో అని, ఏదైనా డాబాలో ఉన్నారు అనుకోండి, మీకు భయం వేస్తుందా? లేదు. మీరు చేసే నామం మీద మీకు విశ్వాసం ఉంటే మీరు డాబాలో ఉన్నట్టు. మీకు ఎన్ని బాధలు ఉన్నా, సంసారంలో ఎన్ని హెచ్చుతగ్గులు ఉన్నప్పటికీ మీరు చేసే నామం మీద కనుక మీకు ప్రీతిఉంటే, మీకు ఓర్పు ఉంటే, మీకు భయం అనేది రాదు. అది ఒక పద్ధతే, అది ఒక మార్గమే రమణమహర్షి గారు దానిని ఖండించలేదు. ఆయన ఖండించటానికి ఇక్కడకు రాలేదు. ఒక మార్గం చూపించి వెళదాం అని ఆయన ఇక్కడకు వచ్చారు. మీరు అందరూ జ్ఞానం సంపాదించండి అని గీతలో ఎన్నో సార్లు ప్రతీ అధ్యాయంలోను డైరెక్ట్ గాను, ఇన్‌డైరెక్ట్ గాను పరమాత్మ చెప్పాడు ఎవడైతే జ్ఞానం సంపాదించాడో వాడు నా స్వరూపం పొందుతాడు, వాడితో సమానమైన వాడు కాని, వాడికి మించిన వాడు కాని ఈ లోకంలో కాని పరలోకంలో కాని లేడు అని భగవంతుడు చెబుతుంటే మనకి తెల్లారి లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు మనకు జ్ఞానం దర్శనం అవటం లేదు కాని అజ్ఞానం దర్శనం అవుతోంది. ఉదయం లేవగానే ఆత్మ దర్శనం కాదు అహంకారం దర్శనం అవుతోంది. ఆత్మ కోసం మనం పూజలు చేయటం లేదు. అహంకారం కోసం పూజలు చేస్తున్నాం. నా అహంకారం సంతృప్తి పరుచుకోవటం కోసం నేనుపూజలు చేయటం, నా అహంకారం సంతృప్తి పరుచుకోవటం కోసమే నేను దానాలు చేయటం. నా అహంకారం సంతృప్తి కోసమే నేను యజ్ఞాలు, యాగాలు, చేయటం. మీరు చేసే దానాలు, మీరు చేసే ధర్మాలు, ఇవన్నీ నిజమా? మీరు చేసే పారాయణాలు, మీరు చేసే యజ్ఞాలు, మీరు చేసే యాగాలు ఇవన్నీ నిజం అయితే మీకు ఎందుకు దేవుడు దర్శనం ఇవ్వటం లేదు? ఒక మనిషి ఇంకొక మనిషిని మోసగించగలడు, ఒక దేశం ఇంకో దేశాన్ని మోసగించగలదు, ఒక సమాజం ఇంకొక సమాజాన్ని మోసగించగలదు, కాని మానవుడు దేవుణ్ణి మోసగించలేడు. మీరు పెట్టే నమస్కారాల వల్ల, మీరు పాడే కీర్తనల వల్ల దేవుడు మోసపోడు, దేవుడు అంత అమాయకుడు కాదు.

మేము భగవద్గీత పారాయణ చేస్తున్నాం, ఉపనిషత్తులు పారాయణ చేస్తున్నాం, రామాయణం పారాయణ చేస్తున్నాం అంటున్నారు, పారాయణాలు చెయ్యండి నేను కాదు అనటం లేదు, కనీసం ఆ భగవద్గీతలో, ఆ ఉపనిషత్తులో ఒక్క శ్లోకం మీరు అర్థం చేసుకుని దానిని ఆచరించటానికి ప్రయత్నం చెయ్యండి. అప్పుడు అజ్ఞానానికి మీకు మధ్య సంఘర్షణ మొదలు అవుతుంది. ఏదైనా ఒక్క శ్లోకం తీసి దానిని ఆచరించటానికి మీరు ప్రయత్నం చేస్తే మీలోని అజ్ఞానం అంటుకుంటుంది. అది తగలబడటానికి కొంత టైము పట్టవచ్చు కాని కనీసం అప్పుడు అంటుకుంటుంది. ఇవన్నీ మీరు ఆచరించడానికి ప్రయత్నం చెయ్యండి. మేము ఆచరించము, పారాయణాలు చేస్తాం అంటే పారాయణాలు ఎందుకు? పుణ్యాల కోసం చేస్తున్నారు. ఎందుకు పుణ్యాలు? ఇంకా మంచి జన్మల కోసం, మంచి లోకాల కోసం, ఇవన్నీ నిజంలా మీకు కనిపించవచ్చు, కాని ఇదంతా మాయలో భాగం. ఇది మీరు అర్థం చేసుకోండి.

చివరి రోజుల్లో రమణస్వామిని ఒక దొర గారు అడిగారు మీరు మమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళిపోతున్నారు. మా ఆస్తులు విడిచిపెట్టి, మా కుటుంబాలు విడిచిపెట్టి, అన్నీ విడిచి పెట్టి, మీ దగ్గరకు వచ్చాము. ఇప్పుడు మీరు మమ్మల్ని విడిచి పెట్టి వెళ్ళిపోతున్నారు అంటే అప్పుడు రమణస్వామి అన్నారు నేను ఎక్కడికి వెళ్ళిపోతాను, ఎక్కడికి వెళ్ళటం లేదు. ఇక్కడే ఉన్నాను. I am not going away. నేను ఎక్కడికి వెళ్ళటం లేదు. I am here. నేను ఇక్కడే ఉన్నాను. ఒకవేళ వెళ్ళిపోవాలి అని నాకు ఉంది అనుకో మిమ్మల్ని అందరిని విడిచి పెట్టి ఎక్కడకు వెళ్ళగలను? వెళ్ళటానికి నాకు చోటు ఎక్కడ ఉంది? అటువంటి ఆత్మభావన ఉండాలి. అది మీలోనే ఉంది. ఎక్కడో బయట లేదు. మన ఇంద్రియాలు బహిర్ముఖంగా ఉన్నాయి. మన మనస్సు బహిర్ముఖంగా ఉంది. మన అహంకారం బహిర్ముఖంగా ఉంది. అంతర్ముఖం చెయ్యలేక ఆ వస్తువు కోసం బయట వెతుకుతున్నాం. దేహం వచ్చింది పని చేస్తాం, దేనిని బట్టి పని చేస్తాం? వాసన బట్టి పని చేస్తాం, మళ్ళీ వాసన వస్తుంది, మళ్ళీ దేహం వస్తుంది. ఇదే మాయ, ఇదే అజ్ఞానం.

ప్రతీ మనిషికి స్వార్థం ఉంది, వాడు భక్తుడు అయినా స్వార్థం ఉంది, భక్తుడు కాకపోయినా స్వార్థం ఉంది. మానవుడు స్వార్థంలోంచి బయట పడటం కోసం ఎవడైనా ప్రయత్నం చేస్తున్నాడా? నేను కర్తను అని పని చేస్తే, అహం బుద్ధి తోటి పని చేస్తే, మీరు మంచి చేస్తే మంచి వస్తుంది, చెడు చేస్తే చెడ్డ వస్తుంది. మీరు మంచి పనులు చేస్తే ఉత్తమ లోకాలకి వెళ్ళవచ్చు, చెడ్డ చేస్తే చెడ్డ లోకాలకు వెళ్ళవచ్చు. రమణమహర్షి సందేశం అది కాదు, అదీ స్వప్నం తోటి సమానమే. ఇదీ స్వప్నం తోటి సమానమే. ఇవన్నీ కూడా

ఆత్మలో కల్పితమే. దేంట్లో అయితే కల్పించారో ఆ ఆత్మని గ్రహించు. అప్పుడు కాని ఈ మాయలోంచి బయట పడలేము. మీరు పుణ్యాలు చేస్తారు, మంచి లోకాలకు వెళతారు. అక్కడ ఎంతకాలం ఉంటారు? స్వార్థంలోంచి మనిషి బయటకు రాలేకపోతే వాడికి దేవుడి దర్శనం అవ్వనే అవ్వదు. మీరు ఎన్ని పూజలు చేయండి, ఎన్ని యజ్ఞాలు చేయండి, ఎన్ని యాగాలు చేయండి. కాని మీ శరీరాన్ని, మీ ఇల్లుని, మీ దేశాన్ని, మీ సమాజాన్ని, మీ సంస్కృతిని, మీ భాషని, మీ ప్రాంతీయతత్వాన్ని మరచిపోయి మీరు ఎప్పుడైనా దేవుణ్ణి ప్రేమించారా? ఎప్పుడైనా చిన్న కరుణాపూరితమైన మాట తోటి మానవుడి కోసం చెప్పారా? ప్రతీ వాడు డబ్బు డబ్బు అంటాడు. ప్రతీ దానికి డబ్బు ఉండక్కర్లేదు. ఎదుటి మనిషి సుఖ పడటం కోసం డబ్బు ఉండక్కర్లేదు. మీ ఇంటివద్ద ఎవరైనా ముసలివాళ్ళు ఉంటే ఎలా ఉన్నారు మామగారు, కులాసాగా ఉన్నారా అని కరుణాపూరితమైన ఒక మాట, కరుణా పూరితమైన ఒక చేత ఎప్పుడైనా జీవితంలో మీరు చేశారా? మీకు అహంకారం నశించటం కోసం, స్వార్థం నశించటం కోసం ఇటువంటి పనులు ఎప్పుడైనా చేసారా?

మీరు రామానుజులు పేరు వినే ఉంటారు. తిరుమలలో వెంకటేశ్వరస్వామి గుడి ఉంది, కింద తిరుపతిలో గోవిందరాజస్వామి గుడి ఉంది. ఆ గోవిందరాజస్వామి గుడి రామానుజుడే కట్టించాడు. ఇప్పుడు రమణమహర్షి గారిని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి అవతారం అని పెద్దలు ఎలా చెబుతున్నారో, రాముడి తమ్ముడు లక్ష్మణుడే రామానుజుడిగా జన్మించాడు అని వైష్ణవుల యొక్క నమ్మకం. ఆ రామానుజులు గురువు గారి చేత పద్నాలుగు సార్లో, పదమూడు సార్లో చెప్పించుకున్నాడు వాల్మీకి రామాయణం. ఆ తిరుమల కొండ అంటే ఆయనకు ఎంత ఇష్టం అంటే పాదాల తోటి ఆ కొండను తొక్కలేక గురువు గారిని కొండ పైనుంచి దారిలోకి రమ్మని, ఈయన దారి దాకా నడిచి వెళ్ళేవాడు. రామానుజులు కొన్నాళ్ళు తిరుమల నంబి అనే ఆయనకి అతిథిగా ఉన్నాడు. ఆ తిరుమల నంబికి గోవిందుడు అనే శిష్యుడు ఒకడు ఉన్నాడు. అతను రోజు సాయంత్రం అయ్యే సరికి ఏమి చేసేవాడు అంటే గురువు గారికి మంచం వేసి, పరుపు వేసి, పక్క వేసేవాడు. ఒక రోజున ఏమి



**నీ హృదయ గుహలో నువ్వు ఉండగలిగితే, నీకు ఏకాంతవాసం అంటే ఏమిటో తెలుస్తుంది. తలుపులు వేసేసుకుంటే తెలియదు!**

చేశాడు అంటే పక్క వేసేసాడు, ఆ పక్క వేసేసి దానిమీద దొర్లుతున్నాడు. తిరుమల నంబి ఏదో పనిమీద బయటకు వెళ్ళాడు. రామానుజులు అతని ఇంటి దగ్గరే కూర్చున్నాడు. గోవిందుడు ఏమి చేశాడు అంటే గురువు గారికి పక్క వేసాడు, ఆ పక్క వేసి దానిమీద దొర్లుతున్నాడు. అది రామానుజుడు చూశాడు, ఇదేమి శిష్యుడు, ఆయనకు పక్క వేసాడు అంతవరకు బాగానే ఉంది. ఆయన పక్క మీద ఈయన దొర్లుతాడు ఏమిటి? అని రామానుజులుకి అనిపించింది. రామానుజులు ఏమి చేశాడు అంటే తిరుమల నంబి వచ్చాక ఇదేమిటయ్యా నీకు పక్క వేసాడు నీ శిష్యుడు. తరువాత పక్క మీద దొర్లాడు. ఇది మంచి పద్ధతి కాదు అని చెప్పాడు తిరుమల నంబి తోటి. ఇదండీ గురుప్రేమ అంటే ఇక్కడ చూడండి. ఒళ్లు జలధరిస్తుంది తిరుమల నంబి గోవిందుడిని కేకేశాడు. ఏమయ్యా నేను టౌన్‌లోకి వెళ్లి వచ్చాను, నేను చూడలేదు నాకు పక్క వేసావు నువ్వు, అంతవరకు బాగానే ఉంది, నాకు పక్క వేసి ఆ పక్క మీద ముందు నువ్వు పడుకున్నావు కదా అని అడిగాడు. నేను పడుకున్న మాట నిజమే అన్నాడు. అయితే గురువు గారికి పక్క వేసి గురువు గారి మంచం మీద పడుకుంటే దోషం వస్తుంది అని నీకు తెలుసా? దోషం వస్తుంది అని నాకు తెలుసు. నువ్వు చేసిన దోషానికి శిక్ష కూడా ఉంటుందని నీకు తెలుసా? తెలుసండి. మరణించిన తరువాత చెడ్డలోకాలు వస్తాయి అని నీకు తెలుసా? మరణించిన తరువాత చెడ్డ లోకాలు వస్తాయి అని నాకు తెలుసు. ఇలా అన్నీ తెలుసుండి అంత చెడ్డ పని ఎందుకు చేశావు గోవింద? అన్నాడు. ఆ గురు శిష్యుల ప్రేమ చూడండి. మనది వ్యాపార సరళి, భక్తి ఏమిటి, మాటలు ఏమిటి అన్నీ వ్యాపారమే! జీవితమే వ్యాపారం. అన్నీ తెలిసి ఉన్నవాడివి ఇంత చెడ్డ పని ఎందుకు చేశావు? అంటే అన్ని చెడ్డ లోకాలు వచ్చినా నాకు ఇష్టమే. కాని మీ దగ్గర నేర్చుకున్నానే విద్య, ఆ విద్య నాకు ముఖ్యం. మిమ్మల్ని సుఖ పెట్టడం కోసం, అది హాయిగా ఉందో లేదో మధ్య మధ్యలో ఎక్కడైనా ముడతలు ఉన్నాయేమో చూడటం కోసం, పక్క మీద ఏమైనా చీమలు ఉన్నాయేమో అని చూడటం కోసం, నేను పడుకుని దొర్లాను అనుకోండి ఆ చీమలు కుడితే నన్నే కుడతాయి కదా, మళ్ళీ అప్పుడు దులుపుతాను. ఈ పొరపాటుకి నాకు నరకలోకం వచ్చినా, చెడ్డలోకాలు వచ్చినా ఇవన్నీ అనుభవించటం కోసం, మీ పట్ల నాకు ఉన్న ప్రేమ కొలది, మిమ్మల్ని సుఖపెట్టాలి అనే ఈ ప్రయత్నంలో, ఎంత చెడ్డ నాకు వచ్చినా కూడా ఇవన్నీ నేను భరించటానికి అనుభవించటానికి సిద్ధంగా ఉన్నాను అన్నాడు గోవిందుడు. అప్పుడు రామానుజుడు అన్నాడు "నన్ను వివేకవంతుడని చేశావు అయ్యా గోవింద". గోవిందుడు ఇటువంటి సమాధానం చెబుతాడు అని రామానుజుడు

అనుకోలేదు. ఇంతకు ముందు కంటే నాకు తెలివి తేటలు పెంచావు అన్నాడు.

మన అందరికి స్వార్ధం ఉంది. స్వార్ధాన్ని విడిచి పెట్టకపోతే నిస్వార్ధ స్థితి రాదు. నిస్వార్ధ స్థితి రాకుండా, నిష్కామ స్థితి రాకుండా నిజం అందదు. నిజమే దేవుడు. అయితే నాకు స్వార్ధం ఉంది అని గుర్తించి దాంట్లోంచి బయట పడటం కోసం మానవుడు చేసే ప్రయత్నం ఏమిటి? ఇప్పుడు టెక్నాలజీ పెరిగింది, సైన్సు పెరిగింది. పూర్వం ఇక్కడ నుంచి పాలకొల్లు వెళ్ళాలి అంటే నడిచి పోవాలి. ఇప్పుడు కార్లు వచ్చేసినవి, కాళ్లకు పని లేదు. పూర్వం రోగాలు వస్తే మనుషులు చచ్చిపోయేవారు. ఇప్పుడు ఆ రోగాలకి అన్నిటికి మందులు కనిపెట్టారు. కాని ఒక్కటి జ్ఞాపకం ఉంచుకోండి మీరు ఇదంతా మీ మనసు బాగుపడటం కోసం పనికి రాదు. మీకు ఇష్టం ఉన్నా, లేకపోయినా ఇది కాదు అనకండి. టెక్నాలజీ అభివృద్ధి పొందింది, సైన్సు అభివృద్ధి పొందింది, ఇదంతా అవసరమే. శరీరం సుఖ పడటం కోసం, శరీరంలో ఉన్న రోగాలు తగ్గటం కోసం, ఈ టెక్నాలజీ, ఈ సైన్సు ఉపయోగపడతాయి. మీరు ఎవరో మీరు తెలుసుకోవటానికి, మీ మనసుని మీరు పవిత్రం చేసుకోవటానికి మిమ్మల్ని మీరు బాగుచేసు కోవటానికి ఆత్మసుఖం మీరు పొందటం కోసం ఈ సైన్సు కాని, ఈ టెక్నాలజీ కాని మీకు సహకరించదు. కార్లు వచ్చాయి, విమానాలు వచ్చాయి. పెద్ద పెద్ద instruments వచ్చాయి. సైన్సు చాలా అభివృద్ధి చెందింది. అంతమాత్రం చేత మన ఇంద్రియాలు మనకు స్వాధీనం అయిపోయాయా? నా మనసు నాకు స్వాధీనం అయిపోయిందా? నేను ఇంద్రియాలను జయించానా? నా స్వార్ధం నుండి బయట పడటం కోసం ఈ సైన్సు సహకారం చేసిందా? నా దుఃఖంలోంచి నేను బయట పడటం కోసం ఈ టెక్నాలజీ నాకు ఏమైనా సహకారం చెయ్యగలదా? మంచి విడిచి పెట్టకండి, మంచి చెయ్యండి, మంచి కోసం జీవించండి, మంచి కోసం మాట్లాడండి. మీరు చేసే ప్రతీ మంచి పని మీకే తిరిగి వచ్చేస్తుంది. అలాగే మీరు చేసే చెడ్డ కూడా మీకే తిరిగి వస్తుంది. మీరు కరుణ పెంచుకుంటే, మీరు దయాస్వభావం పెంచుకుంటే, మీరు ధర్మం పెంచుకుంటే, ధర్మం ధర్మం అంటే ఏమిటి న్యాయమే ధర్మం, మీరు న్యాయంగా ఉంటే ధర్మంగా ఉన్నట్టే, న్యాయంగా ఉంటే, సహృదయం కలిగి ఉంటే, సద్బుద్ధి కలిగి ఉంటే, ఎంతో కొంత ప్రేమో, కరుణో, దయో తోటి మానవుల పట్ల చూపిస్తుంటే మీ మనసు సంస్కరించబడుతుంది, మీ మనసు సూక్ష్మం అవుతుంది, మీ మనసు పవిత్రం అవుతుంది, ఆ పవిత్రమైన మనస్సు, ఆ సూక్ష్మం అయిన మనసు మీకు ఆత్మకు దారి తీస్తుంది.

నువ్వు మంచి లోకాలకు వెళ్ళినా నీ మనస్సే కారణం. చెడ్డ లోకాలకు వెళ్ళినా నీ మనస్సే కారణం. అందుచేత నీ మనసుని బాగు చేసుకో, నీ మనసుతో విరోధం పెట్టుకోకు.

నీ మనసు తోటి నువ్వు స్నేహంగా ఉండు. నీ మనసుని స్వాధీనం చేసుకో, నువ్వు బాగు పడాలి అంటే నీ మనసుని నువ్వు అదుపులో పెట్టుకోవాలి. నువ్వు మనసుని అదుపులో పెట్టుకోవు అనుకో, నీ మనసు నీకు విరోధంగా పనిచేస్తుంది అనుకో, నీ మనసు నీకు వ్యతిరేకంగా పని చేస్తుంది అనుకో, నువ్వు అభివృద్ధిలోకి రావు, నీకు పురోభివృద్ధి లేదు. నీ మనసు నీకు శత్రువుగా ఉన్నప్పడు అంతా తిరోగతే. అందుచేత నీ మనసుని బాగు చేసుకో, నీ మనసు సెంటర్. నువ్వు అనేక సమస్యలను పరిష్కారం చేసుకుంటున్నావు రైటే, నీ ఇంట్లో పేచీలు వస్తే, ఊళ్లో పేచీలు వస్తే, సమాజంలో పేచీలు వస్తే, మీరు అనేక సమస్యలను పరిష్కారం చేసుకుంటున్నారు. ఇదంతా మంచిదే కాని మీ మనసు అనే సమస్యని పరిష్కారం చేసుకోండి. మనసు కూడా ఒక సమస్యే, దీన్ని పరిష్కారం చేసుకోండి. మీరు ఏ దేవతలను కొలిచినా మంచిదే. అది ప్రీతిగా చెయ్యండి, ఇష్టంగా చెయ్యండి. మీరు ఏ దేవతలను అయితే ఆరాధిస్తున్నారో, ఏ దేవతలను అయితే పూజిస్తున్నారో, ఏ దేవతలను అయితే స్మరిస్తున్నారో, మీకు తెలియకపోయినా ఆ దేవతలకి తెలుసు ఏది నిజమో, ఆ నిజం దగ్గరకు మిమ్మల్ని పంపే వరకు ఆ దేవత విడిచి పెట్టదు. మంచి చేస్తే ఎత్తుకి ఎత్తు, చెడ్డ చేస్తే ఎత్తుకి ఎత్తు మళ్లీ మీకే ఎదురు అవుతుంది. మీకు ఎవరికి అయినా దుఃఖం ఉండవచ్చు, మీకు ఎవరికి అయినా అశాంతి ఉండవచ్చు. కాని మీకు దేని గురించి అశాంతి వస్తోంది? దేని గురించి దుఃఖం వస్తోంది? అసలు దుఃఖ పడటానికి కాని, అశాంతి పడటానికి కాని, తగినటువంటి కారణం ఈ జగత్తులో ఉందా? ఇది నిజం అని దుఃఖ పడుతున్నారా? మీరు అబద్ధం అని దుఃఖ పడుతున్నారా?

సత్యసాయిబాబా గారు ఈ మధ్య ఒక మాట చెప్పారు అందరికి అన్నం గొడవే కాని ఆత్మ గొడవ ఎవరికీ లేదు అన్నారు, అంటే అన్నం గొడవ అసలు వద్దు అని కాదు, దేహానికి అన్నం అవసరమే, అయితే మీ లక్ష్యం అన్నం కాదు, అన్నం తినవద్దు అని కాదు ఆయన చెప్పేది. మీ లక్ష్యం అన్నం కాదు. మీ లక్ష్యం ఆత్మ, ఆత్మ దర్శనం అయితే కాని మీకు జ్ఞానం కలగదు. జ్ఞానం కలిగితే కాని మాయలోంచి బయట పడలేరు, దుఃఖంలోంచి బయట పడలేరు. ఇవాళ తాత్కాలికంగా మీకు ఏదైనా సుఖం ఉంటే, సంతోషం ఉంటే, ఇది నిజం అని మీరు నమ్మకండి. ఇది ఊడిపోవటానికి ఎంతో కాలం పట్టదు. రేపు తెలుసుకుందాం, మళ్లీ జన్మలో తెలుసుకుందాం అంటే రేపుకి అంతే ఉండదు. మళ్లీ జన్మలో మనకి పరిస్థితులు అనుకూలంగా ఉంటాయో, ఉండవోఏమి చెప్పగలం? వారు మమ్మల్ని తిట్టారు, వారు కొట్టారు, వారు ఏదో మాటలు అన్నారు, ఇటువంటి మాటలు చెపుతూ ఉంటారు. అవే

భరించలేకపోతే మీరు ఆత్మని ఎక్కడ తెలుసుకుంటారు? మీ బుద్ధిని మరింత బలం చేయటం కోసం, మీ మనసుని మరింత బలం చేయటం కోసం, ఆత్మాభిముఖంగా నడిపించటం కోసం, తలుపు సందులో పెట్టి నలిపేసినట్టు భగవంతుడు మిమ్మల్ని కష్టాల్లో పెడతాడు. ఎందుకంటే మిమ్మల్ని బలవంతులని చేయటం కోసం, అది చూసి మీరు కంగారు పడకండి. మీ యందు ప్రేమ ఉంది కాబట్టే, మీ మనసుని తయారు చెయ్యడం కోసం, మీ బుద్ధి యొక్క వైభవాన్ని పెంచటం కోసం, ఆత్మ వైపుకి మీ చేత గురి పెట్టించటం కోసం, ఒకొక్కసారి కొన్ని కొన్ని క్లిష్ట పరిస్థితులు ఎదురవుతాయి. వాటిని చూసి పారిపోకండి.


మన అహంకారానికి అవమానాలు అంటే ఇష్టం ఉండదు, బహుమానాలు అంటే ఇష్టం. మనం బహుమానాలకి అలవాటు పడితే అహంకారం పెరుగుతుంది. అవమానాలకి అలవాటు పడితే అహంకారం తగ్గుతుంది. ఎవరైనా మనలని పొగిడారు అనుకోండి ఎంతో సంతోషిస్తాం. ఎవరైనా విమర్శిస్తే, ఎవరైనా తిడితే ఏడుస్తాం, దుఃఖ పడతాం, మళ్ళీ ఇంకొకడితో చెబుతాం. ఫలానా అమ్మగారు నన్ను ఇలా తిట్టి పోశారు అని. ఎవరి తోటి చెప్పకండి నేను మీకు ఒక రహస్యం చెబుతాను. మీ అహంకారం మీకు శత్రువు. నీ అహంకారాన్ని జయిస్తే నీకు నువ్వు మిత్రుడు అవుతావు. నీ అహంకారాన్ని జయించకపోతే నీకు నువ్వే శత్రువు అవుతావు. నీకు ఎవరు శత్రువు? నీ అహంకారమే నీ శత్రువు అని పరమాత్మ చెబుతున్నాడు. నీ విరోధులు ఎవరిని విమర్శిస్తున్నారు? నీ అహంకారాన్ని విమర్శిస్తున్నారు. నీ మిత్రులు ఎవరిని పొగుడుతున్నారు? నీ అహంకారాన్నే పొగుడుతున్నారు. అందుచేత నిజంగా నీ శత్రువులు నీకు సహాయం చేస్తున్నారా? నీ మిత్రులు నీకు సహాయం చేస్తున్నారా? ఈ చిన్న రహస్యాన్ని మీరు అర్థం చేసుకోండి. ఈ విషయం మీకు అర్థం అయితే మీ శత్రువులను మీరు ద్వేషిస్తారా? ప్రేమిస్తారా? మీకెన్నో కుయుక్తులు తెలిసి ఉండవచ్చు, కుతంత్రాలు చేతనై ఉండవచ్చు. మీ కుయుక్తులకు, మీ కుతంత్రాలకి, మీ కుచేష్టలకి ఆత్మ అందదు. మీరు పెద్ద పెద్ద పనులు చేయవద్దు. చిన్న చిన్న పనులు చేయండి. ఆ పనులు నిష్కామంగా ఉండాలి. అప్పుడు ఈశ్వరుడు సంతోషిస్తాడు. మిమ్మల్ని సింహాసనం మీద కూర్చోపెడతాడు. మీరు అడగక్కర్లేకుండా మీకు ఏది మంచిదో, అది మీకు ఇస్తాడు. కోరికకు శక్తి లేదు, పరమాత్మకి శక్తి ఉంది. మీరు మంచి ఉద్దేశం తోటి చేస్తే మీరు చేసే చిన్న పని కూడా పెద్ద ఫలితం ఇస్తుంది. మీ ఉద్దేశం మంచిది కాకపోతే చేసింది పెద్ద పని అయినప్పటికీ చిన్న ఫలితం ఇస్తుంది.

**కర్తు రాజ్ఞయా ప్రాప్యతే ఫలం**

**కర్మ కిం పరం కర్మ తజ్జడం ॥**

కర్మ జడ వస్తువు, కర్మకి ఫలితాన్ని ఇచ్చే శక్తి లేదు. ఫలితాన్ని ఇచ్చేవాడు పరమేశ్వరుడు. వాడు సర్వ సాక్షి, అన్నీ చూస్తున్నాడు. వాడు ఎక్కడో దూరంగా లేడు మీ హృదయంలోనే ఉన్నాడు. నువ్వు నిద్రపోతావు కానీ వాడికి నిద్ర లేదు. నిద్రపోకుండా లోపల చూసే డ్రైవర్ ఈశ్వరుడు ఉన్నాడు. వాడు సర్వ సాక్షి నువ్వు చేసేది చిన్న పని అయినా నువ్వు కరుణా హృదయం తోటి చేస్తున్నావా లేదా వాడు చూస్తూ ఉంటాడు. దాన్ని బట్టి మీకు కర్తురాజ్ఞయాప్రాప్యతే ఫలం. మీరు చేసేది బహు చిన్న పని అయినా, స్వల్పం అయినా అల్పం అయినా, నువ్వు కరుణా హృదయం తోటి, మంచి సంకల్పం తోటి, మంచి హృదయం తోటి చేసి వదిలేయ్. నిన్ను ప్రేమ శిఖరాలకి తీసుకెళ్ళి, నిన్ను మోక్ష సామ్రాజ్యానికి అధిపతిని చేస్తాడు. నువ్వు ఫలితాల కోసం ఎదురు చూడకు, నువ్వు చేసి వదిలేయ్, మంచి సంకల్పం తోటి మంచి హృదయం తోటి చేసి వదిలేయ్, ఫలితం ఈశ్వరుడి చేతిలో ఉంది, నువ్వు ఆయనని బలవంతం చేస్తే ఇవ్వడు. అది ఈశ్వరుడు ఇష్టానుసారం వస్తుంది. నువ్వు చేసే కర్మను బట్టి ఫలితం రాదు, నువ్వు చిన్న పని చేసినా పెద్ద ఫలితం రావచ్చు, పెద్ద పని చేసినా చిన్న ఫలితమే రావచ్చు, ఎందుచేత నువ్వు చేసేది పనిమటుకే, ఫలితం మటుకు ఈశ్వరుడి చేతిలో ఉంది. ఇచ్చేది ఆయన, పని చెయ్యటమే నీ వంతు. ఫలితం ఇచ్చేది కర్త. కర్త అంటే సృష్టి కర్త, పరమేశ్వరుడు. అందుచేత మీరు చిన్న పని చెయ్యండి, దయతో చేయండి. కనీసం మీ ఇంట్లో ముసలమ్మలు ఉంటే, మీ ఇంటి పక్కన దిక్కు లేని వాళ్ళు ఎవరు అయినా ఉంటే, ఒక చిన్న కరుణా పూరితమైన మాట, ఒక మంచి మాటఅనలేరా? ఒక మాటకు కూడా కరువాసి ఉన్నారా మీరు? డబ్బులు కోసం కరువాసి ఉండవచ్చు, మాటకు కూడా కరువాసి ఉన్నారా? ఒక వంద గుడులు, వంద ఆసుపత్రులు కట్టేశారు అనుకోండి వాడు జ్ఞాని కాదు, వాడి దేహ ప్రారబ్ధాన్ని బట్టి కడితే కట్టొచ్చు. ఎవడు జ్ఞాని

**పరిస్థితులు అనుకూలంగా ఉన్నా, ప్రతికూలంగా ఉన్నా ఈశ్వరుడి పట్ల విశ్వాసం పోకూడదు. నా పట్ల ప్రేమ, భక్తి, శ్రద్ధ కలిగి ఉండాలి, నా రూపాన్ని ధ్యానం చేస్తూ, నా నామాన్ని స్మరిస్తూ ఉండాలి అని పరమాత్మ చెప్పాడు. మనకి శ్వాస పోయినా భగవంతుడి పట్ల విశ్వాసం చెదరకూడదు.**



అంటే? ఎవడు రాగ ద్వేషాల నుండి బయట పడ్డాడో, ఎవడు రాగ ద్వేషాలని విడిచి పెట్టేశాడో, వాడిలో ఉంది వైభవం అంతా, అక్కడ ఉంది. ఏ విషయం గురించి మీరు తొందర పడకండి. ప్రతీ చిన్న విషయానికి భయపడకండి. భయపడితే మీరు భగవంతుడికి దూరం అయిపోతారు. మీకు భగవంతుడి మీద భక్తి ఉన్న మాట నిజం అయితే మీకు భయం ఉండదు, మీకు భయం వేస్తుంది అంటే భగవంతుడి మీద భక్తి తక్కువగా ఉన్నట్టు.

సమర్థ రామదాసు అని శివాజీ గురువు, ఆయన కేవలం అద్వైతమే కాదు రామ నామం చేసుకోండి, కృష్ణ నామం చేసుకోండి అని చెబుతూ ఉండేవారు. నామాన్ని విడిచి పెట్టకండి, నామమే మీ సొమ్ము. నామం కూడా ఐశ్వర్యమే, భగవంతుడిని ప్రీతిగా స్మరించుకోండి అని సమర్థ రామదాసు గారు చెప్పారు. శివాజీ ఆస్థానం లోనే ఒక పండితుడు ఉండేవాడు. ఆయన ఏమి అనేవాడు అంటే ఇదంతా మాయ అయ్యా, నామంలో ఏముంది, అది ఏముంది, ఇది ఏముంది. ఇదంతా మాయ అనేవాడు. సమర్థ రామదాసు గారిని, మీకు పాండిత్యం సరిగా లేదు అందుచేత మీరు నామం గురించి చెబుతున్నారు అనేవాడు. సమర్థ రామదాసు గారు ఓర్పు పట్టారు. శివాజీ రాజ్యంలోకి ఒక మంత్రగాడు వచ్చాడు. డబ్బా పెడతాడు రూపాయలు కారిపోతాయి. వాడు రూపాయలు మనలను అడుక్కుంటాడు మళ్ళీ. వాడు వచ్చి ఏమి చేశాడు అంటే ఒక తాడుని తిప్పి పాముగా మార్చేశాడు. ఓ బుసలు కొట్టేస్తోంది. దగ్గర కూర్చున్న వాళ్ళు లేచిపోయారు. అప్పడు సమర్థ రామదాసు పైకి చూసి పండితులు వారు మీరు ఇదంతా మాయ అంటున్నారు కదా, వాడు మాంత్రికుడు, అది తాడే పాముగా చేశాడు. మీరు వెళ్లి ఆ పాముని నా దగ్గరకి తెండి అన్నాడు. అమ్మ బాబోయ్ నేను వెళ్ళను దగ్గరకు వెళితే కరిచేలా ఉంది అన్నాడు. మరి అంత భయస్తుడవు ఇదంతా మాయ అని చెప్పటానికి నువ్వు పనికి వస్తావా అన్నాడు? అప్పడు రామదాసు గారు లేచి ఆ పాముని చేతితోటీ పట్టుకుని తీసుకొచ్చి దగ్గర కూర్చున్నాడు. ఇంతకీ రామదాసు గారు చెప్పిన మాట ఏమిటంటే, మీకు అనుభవం లేనప్పడు నోటి తోటి చెప్పి ఏమి లాభం లేదు, ఈ ప్రపంచం నీకు నిజంగా కనిపిస్తోంది. నోటితోటి మాయ అంటే సరిపోతుందా? అది తాడు అయినప్పటికీ నీకు పాములా కనిపిస్తోంది, భయం వేస్తోంది, దగ్గరకు వెళ్ళను అంటున్నావు. అదే విధంగా ప్రపంచం కూడా అబద్ధం అయినప్పటికీ నీకు నిజంలా కనిపిస్తోంది. నీ హృదయానికి అబద్ధంలా తోచినప్పడు ఇది అబద్ధం అని చెప్ప. మెట్ట వేదాంతం చెప్పద్దు అని చెప్పారు.

మీకు తాత్కాలికంగా కొన్ని బాధలు ఉండవచ్చు. ఈ బాధలు మీరు పరిష్కరించు కుంటారు అనుకోండి కొత్త బాధలు వస్తాయి. ఈ లోపులో ఈ శరీరం పడిపోతుంది, మళ్ళీ

కొత్త శరీరం వస్తుంది. మళ్ళీ అక్కడ ఉన్న బాధలు పరిష్కరించుకుంటారు అనుకోండి కొత్త బాధలు వస్తాయి. అదే విధంగా ఈ దేహానికే పరిమితం అయిన నేను ఉన్నంతకాలం, ఈ దేహం మాత్రమే నేను అనుకునే బుద్ధి ఉన్నంతకాలం, ప్రతీ వాడికిఏదో ఒక బాధ వస్తూనే ఉంటుంది, కష్టం వస్తూనే ఉంటుంది, వాడికి మరణం వస్తూనే ఉంటుంది, జన్మ వస్తూనే ఉంటుంది. తాత్కాలికంగా మీకు ఏదైనా సుఖంగా ఉన్నట్లు అనిపించినా అది సుఖం కాదు దుఃఖం. పుస్తకాలు అవసరం అయితే మీరు చదువుకోండి నేను వద్దు అనటం లేదు. నేనుని తెలుసుకోవటానికి మీకు పుస్తకాల తోటి పని ఏముంది అసలు? దేవాలయాలతోటి పని ఏముంది? శాస్త్రాల తోటి పని ఏముంది? దేవతల తోటి పని ఏముంది? మీకు దేవతల సహాయం అవసరం అయితే తీసుకోండి, మంత్రాల సహాయం అవసరం అయితే తీసుకోండి, పుస్తకాల సహాయం అవసరం అయితే తీసుకోండి, వద్దు అనటం లేదు, వీటి తోటి ఏమి పని లేకుండా నేనుని తెలుసుకోవచ్చు. నీకు కోప తాపాలు లేనప్పుడు, రాగ ద్వేషాలు లేనప్పుడు కూడా నేను అనే బుద్ధి ఉంది. మీరు ప్రశాంతంగా కూర్చున్నప్పుడు కూడా నేను అనే బుద్ధి ఉంది. ఈ నేను అనే బుద్ధి మీకు కామన్‌గా ఎప్పడూ ఉంటుంది. అది పరిష్కారం అయ్యే వరకు జన్మ రహస్యం తెలియదు, సృష్టి రహస్యం తెలియదు. ఎదుటి వాళ్ళు సహకరించటం కాదు, మీ ఇంద్రియాలు మీకు సహకరించాలి, మీ మనస్సు మీకు సహకరించాలి, మీ బుద్ధి మీకు సహకరించాలి, మీరు చేసే పని మీకు సహకరించాలి. ఇన్ని రకాలుగా సహకారం మీకు దొరికితేనే మీరు ఎవరో మీకు తెలుస్తుంది.

రమణమహర్షి గారితో ఒక భక్తుడు ఆశ్రమంలో ఒకతను పేరు చెప్పి ఆయన చాలా పండితుడే కానీ మాట్లాడితే చిరాకు పడుతున్నాడు అలా మాట్లాడుతున్నాడు ఏమిటి అని అడిగాడు. దానికి భగవాన్ ఏమన్నారో చూడండి లోపలున్న వాసన బయటకు రావాలి. లోపల వాసన ఉంది కాబట్టి అలా మాట్లాడుతున్నాడు. అలా మాట్లాడటం ద్వారా కానీ ఆ వాసన బయటకి పోదేమో, నువ్వు ఎందుకు కంగారు పడతావు? అలా మాట్లాడితే కాని వాడి వాసన బయటకు వెళ్ళదు, అందుకు మాట్లాడుతున్నాడు. నువ్వు కంగారు పడవలసిన పని లేదు. నాలో ఉన్న వాసన నాశనం అయ్యేవరకూ నాకు జ్ఞానం కలగదు. డాక్టరు గారు టేపు చేస్తున్నారు నేను ఏ మాట చెబుతుంటే, ఆ మాటే టేపులో పడుతుంది. మళ్ళీ రేపు కూడా ఆ మాటలే పలుకుతుంది. కొత్త మాటలు పలుకుతుందా? పలకదు. అదే విధంగా ఈ జన్మలో మనం కర్తృత్వం పెట్టుకుని, అహంకారం పెట్టుకుని, ఏ పనులు అయితే మనం చేస్తున్నామో, ఆ పనుల వల్ల వచ్చే సంస్కారాలు అన్ని నా హృదయంలో టేపు అయిపోతూ ఉంటాయి. నా హృదయంలో

ఉన్న టేపే మళ్ళీ రాబోయే జన్మలో విప్పతారు. టేపులో రికార్డు అయిన మాటే మరల మనకు ఎలా వినపడుతుందో, హృదయంలో ఉన్న వాసనే మళ్ళీ కోరికగా ఏర్పడుతుంది, ఆ కోరిక మళ్ళీ పని చేస్తుంది. ఆ పని చేస్తే మళ్ళీ కర్మ వస్తుంది. కర్మ వస్తే మళ్ళీ శరీరం వస్తుంది. మళ్ళీ ఈ చక్రం నుండి బయటకు రాలేము. కామం ఉండకూడదు, క్రోధం ఉండకూడదు, లోభిత్వం ఉండకూడదు అని భగవంతుడు చెప్పాడు. కాని భగవంతుడు అంత లోభి మరొకడు లేడు. ఎందుచేత చెప్పమంటారా? లోభి ఏమి చేస్తాడు? ప్రతీ పైసా లెక్కపెట్టుకుంటాడు. అలాగే భగవంతుడు కూడా ఏమి చేస్తున్నాడు అంటే హృదయంలో ఉండి మనం చేసే ప్రతీ చిన్న మంచి పని, ప్రతీ చెడ్డ పని రికార్డు చేసేస్తాడు. తెలియక చేశాడు అనివిడిచి పెట్టడు. వీడు లోభి అవునా, కాదా? నీ శరీరం కంటే, నీ ఇంద్రియాల కంటే, నీ నేత్రములు కంటే, నీ గుండె కంటే అన్నింటికంటే అత్యంత సమీపంలో పరమాత్మ నీ హృదయంలో ఉన్నాడు, చూస్తున్నాడు. వైకుంఠంలో ఉన్న దేవుడు కైలాసంలో ఉన్న దేవుడు అయితే మీకు దూరంగా ఉన్నాడు కదా కనపడడు అనుకుని తలుపులు వేసేసుకుంటారు ఏమో కానీ పరమాత్మ మీ హృదయంలో ఉన్నాడు, చూస్తున్నాడు, మీకు వచ్చే ప్రతి చిన్న చెడ్డ తలంపుకి కూడా సాక్షిగా ఉండి రికార్డు చేస్తున్నాడు. నీకు బయట ఉన్న దేవుడు కొన్ని వదిలివేయవచ్చు, లోపల ఉన్న దేవుడు ఉన్నాడు చూడండి వాడు అన్నీ రికార్డు చేసుకుంటున్నాడు. అన్నిటికి మీరు సమాధానం చెప్పాలి. మీరు సమాధానం చెప్పే వరకు మిమ్మల్ని విడిచి పెట్టడు. ఈ కర్మ చక్రంలోంచి నువ్వు బయటకు వెళ్లలేవు.


## రమణ భాస్కర చందాదారులకు విన్నపం

**రమణ భాస్కర శాశ్వత చందా (10 సం॥లకు) రు॥ 1200/-లు**. రమణ భాస్కర శాశ్వత చందాదారులుగా చేరి పత్రికను ప్రోత్సహించవలసినదిగా కోరుచున్నాము.

**సంవత్సర చందా రు॥ 150/-లు**. సంవత్సర చందాదారులకు చందా గడువు ముగిసినది. మీ చందాను స్వయంగా గానీ లేక


**శ్రీ రమణక్షేత్రం, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యడ్ల బజార్, పాలకొల్లు బ్రాంచి** అకౌంట్ నెంబర్ **520101264185724 (IFSC Code : UBIN0827533)** నందు గాని చెల్లించగలరు. చందాను **బ్యాంక్ అకౌంట్‌లో జమచేసినవారు** జమచేసిన తేదీ, వారి అడ్రసును **9866715896** ఫోన్ నెంబరుకు తెలియపరచగలరు.

# సాధనకి సాధనాలు

## (శ్రీనాన్నగారి అనుగ్రహభాషణముల నుంచి సేకరణ)

**భక్తి :** అన్నిటికంటే భక్తి ముఖ్యం. మనస్సుకి లోచూపు రావటానికి, మనస్సుకి అంతర్ దృష్టి రావటానికి, వివేకం పెరగటానికి, విజ్ఞత పెరగటానికి, జీవితాన్ని సరిదిద్దుకోవటానికి, అతిగావెళ్ళకుండా మధ్యేమార్గంలో ప్రయాణం చేయటానికి, వీటన్నిటికీ కూడా భక్తి అవసరం. భక్తి లేకుండా ముక్తి రాదు. శంకరాచార్యులు వారు భక్తిని ఆలంబనగా చేసుకొని భక్తి ద్వారా జ్ఞానాన్ని సంపాదించమని చెప్పారు. శ్రీకృష్ణ చైతన్యులు జ్ఞానం ద్వారా భక్తి సంపాదించ మని చెప్పారు. అదీ ఇదీ ఒకటే! భక్తుడు భగవంతుడి తోటి ఒకటి అయ్యేవరకూ సాధన చెయ్యాలి. అటువంటి భక్తిని నువ్వు సంపాదించు అన్నారు శ్రీకృష్ణ చైతన్య. దానికి మీ వివేకం ఉపయోగించుకోండి, భగవంతుడు మీకిచ్చిన అవకాశాలను ఉపయోగించుకోండి. భగవంతుడు కొంతమందికి కొన్ని అవకాశాలు ఇస్తాడు. మీకు ఇచ్చిన అవకాశాలను దుర్వినియోగం చెయ్యవద్దు. ఆ అవకాశాలని సద్వినియోగం చేసుకోండి.

**కళ్యాణ గుణాలు :** శ్రీరామచంద్రమూర్తికి అన్నీ కళ్యాణ గుణాలే. ఆయనని మర్యాద పురుషోత్తముడు అంటారు. కళ్యాణ గుణాలు ఎందుకు కావాలి అంటే, కళ్యాణ గుణాలు ఎవరికైతే ఉన్నాయో వాళ్లకి భయం తగ్గిపోతుంది. కళ్యాణ గుణాలు, సుగుణాలు ఉన్నవాడు బేధరహిత స్థితిని పొందుతాడు. వాడికి నువ్వువేరు నేనువేరు అనే బేధబుద్ధి తగ్గుతుంది. బేధం తగ్గిపోతూ ఉంటే భయం తగ్గుతుంది. ప్రతీ మనిషికీ భయం. మిమ్మల్ని చూస్తే నాకు భయం, నన్ను చూస్తే మీకు భయం. ఈ భయం ఉన్నంతకాలం మనకి మోక్షానుభవం కలగదు. పిల్లిని చూస్తే ఎలుకకి భయం, ముంగిసని చూస్తే పాముకి భయం. మీ విరోధులను చూస్తే మీకు భయం. ఈ భయం అనేది, మీకు దుఃఖం తీసుకువస్తుంది, అందుచేత భయరహితుడవు అవ్వు, అని పరమాత్మ చెప్పాడు. ఈశ్వరుడి స్మరణ వల్ల, ఈశ్వరుడికి శరణాగతి చేయటం వల్ల మనకి అభయస్థితి కలుగుతుంది. కోపంతోటి ఏ పని చేసినా, కోపంతోటి ఏ మాట మాట్లాడినా తరువాత దుఃఖపడాలి అన్నారు ఆచార్యులువారు. ఈ కోపం నిజం కాదు, అసూయ నిజం కాదు, ఇవన్నీ నిజాలు కాదు, ఊరికే వికారాలు ఇవి. అందుచేత మనకి ఎప్పుడైనా కోపం వచ్చినప్పుడు నోరు మూసుకోవటం మంచిది. ఎక్కువ కోపం వచ్చినప్పుడు చెడ్డ మాటలు వస్తాయి. మనం ఉద్రేకంతోటి మాట్లాడితే మళ్ళీ మనం పశ్చాతాప పడాలి. ఉద్రేకంతోటి మాట్లాడటం ఎందుకు మళ్ళీ పశ్చాతాప పడటం ఎందుకు! అందుచేత కోపాన్ని విడిచిపెట్టమని చెప్పారు. రమణమహర్షి గారు ఏమన్నారంటే, వారి మీద వీరి మీద కోపం ఎందుకు, నీ కోపం మీదే నువ్వు కోపం తెచ్చుకో. వాళ్ళు ఉంటే కదా, వాళ్ళు లేనే లేరు అసలు, ఊరికే నీడలు ఇవి. నీమీద నువ్వు కోపం తెచ్చుకో, ఇతరుల మీద కాదు, నీ కోపం మీద నువ్వు కోపం తెచ్చుకో అన్నారు. కళ్యాణ గుణాలు సంపాదించుకుంటే, ఈ కళ్యాణ గుణాలవల్ల కోపం తగ్గుతుంది, భయం తగ్గుతుంది, రాగం తగ్గుతుంది, వైరాగ్యం పెరుగుతుంది, వివేకం పెరుగుతుంది, జ్ఞానం పెరుగుతుంది, విచక్షణ కూడా పెరుగుతుంది.




**నవిసి చెడు ఫలము నందేమి ఫల మేరి**

**పక్వత లోగును మరుణాచాలా ।61।**

**తాత్పర్యము:** పక్వానికి రాక పాడైన పండును నీవు మాత్రం ఏమి చేసుకుంటావు అరుణాచలా? నా బుద్ధిలో ఉన్న దోషాలను తొలగించి, నన్ను పక్వము చేసి, అప్పుడు నీలో ఐక్యం చేసుకో అరుణాచలా.

మన దేహ ప్రారబ్ధాన్ని బట్టి మనకి స్నేహితులు బంధువులు దొరుకుతారు. నేను చెడ్డ స్నేహాలు చేసి, నేను శుభ్రంగా పాడవక ముందే, నీ కరుణ నాయందు చూపించి నన్ను అనుగ్రహించు అరుణాచలా! శరీరం చచ్చిపోయాక డాక్టర్ వచ్చి ఏమి చేస్తాడు! అలాగే నేను పూర్తిగా పాడైపోయిన తరువాత నువ్వు చేసేది ఏముంది? నేను పాడైపోకముందే నన్ను నీలో ఐక్యం చేసుకో అరుణాచలా. కుళ్ళిపోయిన కాయని ఏం భుజిస్తావు నువ్వు? అంటే నేను బొత్తిగా కుల్లిపోక ముందే నీ ఒడిలోకి నన్ను తీసుకో అరుణాచలేశ్వరుడా. నేను పూర్తిగా పాడవకముందే నువ్వు రక్షించాలి, నన్ను నువ్వు తీసుకోవాలి.

అంటే ఇక్కడ అరుణాచలేశ్వరుడి తోటి చెపుతాడు - ఈ భౌతికమైన దేహం, పంచభూతాలతోటి నిర్మించినటువంటి ఈ దేహం స్మశానంలో కాలి బూడిద అవ్వకముందే నీ జ్ఞానాగ్ని పంపించి ఈ దేహం మీద నాకున్న అభిమానాన్ని పోగొట్టు. దేహం పోయిన తరువాత ఇంక నువ్వు చేసేది ఏమీ లేదు. దేహం ఉండగానే నీ జ్ఞానం తోటి అనుగ్రహించు. నేను పూర్తిగా కుళ్ళిపోకముందే నీ కరుణ నాయందు చూపించి నన్ను అనుగ్రహించు అరుణాచలేశ్వరుడా అంటున్నారు.



# శ్రీమద్భగవద్గీత

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహ భాషణముల నుండి)

**బాహ్య స్పర్శేష్వసక్తాత్మా విందత్యాత్మని యత్సుఖమ్।**

**స బ్రహ్మయోగ యుక్తాత్మా సుఖమక్షయ మశ్నుతే ॥05:21॥**

**తాత్పర్యం:** ప్రాపంచిక విషయముల యందు అనాసక్తమైన అంతఃకరణము గల సాధకుడు ఆత్మయందు ఏ సుఖము కలదో అట్టి సుఖమును పొందుచున్నాడు. పిదప అతడు బ్రహ్మ నిష్టయను సమాధితో గూడుకొనినవాడై అక్షయానందమును అనుభవించును.

బాహ్య స్పర్శేసు అసక్తాత్మా - బాహ్యవిషయాల పట్ల మనస్సుకి అనాసక్తి ఉండాలి. మనకి ఈ లోకసుఖాల మీద ఆసక్తి ఉంటుంది. ఒక్కో మనసుకి ఒక్కో విషయం మీద ఆసక్తి ఉంటుంది. ఏదో కృష్ణా రామా అనుకున్నా శరీరం ఉన్నచోట మనస్సు ఉండదు. బాహ్య విషయాల పట్ల బాహ్య స్పర్శల తాలూకు సుఖాల పట్ల ఆసక్తి ఉంటే, ధ్యానం చేసినా జపం చేసినా మనస్సు ఆగదు. ఎక్కడైతే ఇదివరకు భోగాలు అనుభవించామో, మనస్సు అక్కడికి వెళ్ళిపోతూ ఉంటుంది. ఆ భోగాలని ఎంజాయ్ చేయటంవల్ల, ఆ బాహ్యవిషయాలలో సుఖం లేకపోయినా వాటికి అలవాటు పడి, మనస్సు బయటికి పరుగుపెడుతుంది.

బాహ్యవిషయాల పట్ల ఆసక్తులు పెట్టుకొని, బయటి రుచులకు అలవాటు పడి మనస్సుని బయటికి వెళ్ళకూడదు అంటే అది ఆగదు. శరీరం పూజగదిలో ఉన్నా మనస్సుకి సినిమాకి వెళ్లాలని ఉంటే, శరీరాన్ని అక్కడ ఉండనివ్వదు, బయటికి లాక్కొనిపోతుంది. అందుచేత బాహ్యవిషయాల మీద ఆసక్తి తగ్గించుకోండి. బయట పదార్థాల మీద కాని,

వ్యక్తుల మీద కాని ఎక్కడా దానికి ఆసక్తి ఉండకూడదు.

విందతి ఆత్మని - బయటి విషయాల మీద మనస్సుకి ఆకర్షణ తగ్గిపోతే అప్పుడు లోపలికి వెళ్ళటం ప్రారంభిస్తుంది. మైండ్ బయటికి వెళ్ళటానికి దానికేమీ ఆకర్షణలు లేనప్పుడు మనస్సుకి అంతర్ దృషి కలుగుతుంది. మనస్సు అంతర్ముఖం అవ్వకుండా ఆత్మజ్ఞానం కలగదు.

యత్సుఖమ్ - ఎప్పుడైతే మనస్సు లోపలకు ప్రయాణం చేయటం ప్రారంభించిందో, మనస్సుకు అంతర్దృష్టి కలిగిందో అప్పడు ఆత్మలో ఏ సుఖమైతే ఉందో, శాంతి ఉందో అది అందుతుంది. ఆత్మసుఖం మనుషుల మీద వస్తువుల మీద చావుపుట్టుకల మీద ఆధారపడి ఉండదు, అది ధనం ఉండటం లేకపోవటం, చదువు ఉండటం లేకపోవటం మీద ఆధారపడి ఉన్న సుఖం కాదు - అది స్వతంత్రమైనది. లోపలికి ఉపసంహరింపబడిన మనస్సును ఆత్మ లోపలికి లాక్కొని దానిలో కలిపేసుకొంటుంది. అప్పుడు నువ్వు సుఖం పొందటం కాదు, నువ్వే సుఖం అయిపోతావు.

ఇక్కడ గ్రహించవలసినది ఏమిటంటే, ప్రతిమనిషికి సుఖం కావాలి. డబ్బు సంపాదించినా, పెళ్లి చేసుకున్నా, చదువుకొని ఉద్యోగం చేసుకున్నా సుఖం కోసమే. బాహ్య విషయాలలో ఏదో ఉంది, బయటి వస్తువుల్లో, మనుషులలో సుఖం ఉంది అనుకున్నంత కాలం మనస్సుని ఆపుచేయలేము. బయటి విషయాల పట్ల ఎవరికైతే పూర్తిగా ఆసక్తి తగ్గిపోతోందో, ఎవరి మనస్సుకి అనాసక్తి వస్తోందో, వాడి మనస్సు మాత్రమే ఉపసంహరించబడి లోపల ఉన్న శాంతి స్థానంలోకి చేరుకొని అక్కడ ఉన్న శాంతిని, సుఖాన్ని, ఆనందాన్ని జుర్రుకోవటం ప్రారంభిస్తుంది. మనస్సుకి కావలసిన సుఖం లోపల హృదయం నుంచి అందుతూ ఉంటే బయటికి వెళ్ళటం మానేస్తుంది, మీరు వెళ్ళమన్నా అది కదలదు మెదలదు.

రమణమహర్షి గారు చెప్పిన ముఖ్యమైన విషయం ఏమిటంటే - మీ స్వరూపంలో తప్పించి ప్రపంచములో ఏ పదార్థములోను ఏ దృశ్యములోను సుఖము లేదు. మీ మనస్సుకి అది అర్థం అయితేనే కాని అది బయటికి వెళ్ళటం మానదు. జపం చేసి ఎంతకాలం ఆపుచేసుకుంటారు? జపం చేసినంతసేపు కుదురుగానే ఉంటుంది, తరువాత బయటికి వెళ్ళిపోతుంది కదా!. బయట ఏమీ లేదని దానికి అవగాహన అవ్వాలి, ఇదే సాధన అంటే. ముక్కు మూసేసుకొని గదిలో కూర్చోవటం సాధన కాదు. అసలు మీరు సాధన ఎందుకు

చేస్తున్నారు, ఎక్కడినుంచి మీరు విత్‌డ్రా అవ్వాలి అది మీకు అవగాహన లేకుండా సాధన చేసినా సక్సెస్ అవ్వలేరు.

ఆత్మలో ఏ సుఖము ఉందో, స్వరూపములో ఏ శాంతి ఉందో, అవి ఉపసంహరింపబడిన మనస్సుకి, ఇంద్రియాలకి అందుతూ ఉంటాయి. దానినే కృష్ణుడు, ఏ సుఖాన్ని పొందిన తరువాత దానికి సమానమైన సుఖం కాని, దానికి మించిన సుఖం కాని లేదని తెలుస్తుందో, అర్జునా అటువంటి సుఖంలోకి నువ్వు మేలుకో, అని చెప్పాడు. పరిస్థితులు అనుకూలంగా ఉంటే శాంతిగానే ఉంటాము. ప్రపంచములో ఎవరికీ లేని కష్టం, ఎవరికీ రాని దుఖం వచ్చినప్పుడు కూడా ఎవరి సుఖం చలించదో ఎవరి శాంతి చలించదో, అదే నిజమైన సుఖం, నిజమైన శాంతి. ఇప్పుడు మనం పొందే సుఖం నిజం కాదు. తుమ్మితే ఊడిపోయే ముక్కు ఎంతసేపు ఉంటుంది! బయటి మనుషుల వల్ల పదార్థాల వల్ల వచ్చేవి నిలబడే సుఖాలు కాదు, ఊడిపోతాయి.

స బ్రహ్మ యోగ యుక్తాత్మా సుఖం అక్షయం అశ్నుతే - ఈ జీవుడికి మూలం బ్రహ్మమే. ఆ బ్రహ్మములోనుంచే జీవ పదార్థము వచ్చింది. అంటే జీవుడు మూలములోకి వెళ్తే బ్రహ్మములో ఐక్యం అవుతాడు. ఇప్పుడు మీకు శరీరముతోటి తాదాత్మ్యము ఎలా ఉందో, ఆ బ్రహ్మపదార్థము తోటి మీకు తాదాప్యము కుదిరితే, ఆ బ్రహ్మముతోటి ఐక్యమైతే, ముగింపులేని నాశనములేని శాశ్వతమైన అక్షయ సుఖాన్ని పొందుతారు. ఆ సుఖం లోపల ప్రవహిస్తూ ఉంటుంది, బయట ఎవరిమీద ఆధారపడి ఉండదు. ఆ సుఖప్రవాహములో మీరు ఓలలాడు తున్నప్పుడు మీ శరీరం పోయినా మీరు పోతున్నారని మీకు అనిపించదు. ఎందుచేతనంటే, ఏదైతే మీకు సుఖాన్ని అందిస్తోందో దానితోటి మీకు తాదాప్యం ఉంటుంది, అది మీరై ఉన్నారు. శరీరం పోయినప్పుడు అది పోదు, ఎప్పడూ ఉంటుంది. ఆ ఉండటము అనే దానిలోంచే మీకు సుఖం అందుతోంది. శరీరం పుట్టకముందు శరీరం పోయిన తరువాత కూడా వాడు ఉంటాడని వాడికి తెలుస్తూ ఉంటుంది. అది బ్రాహ్మీస్థితి!. ఓ అర్జునా నీ శరీరం భూమిమీద తిరుగుతున్నప్పడే ఆ బ్రాహ్మీస్థితిని, ఆ ఉండటమనే స్థితిని పొందు. ఇప్పడే పొందు, వాయిదాలు వెయ్యొద్దు. చనిపోయే రోజుకైనా అక్షయసుఖాన్ని కనుక నువ్వు పొందితే శరీరం పోయినా నువ్వు ఉంటావు అనే అనుభవం నీకు వస్తుంది. అప్పడు నీకు దుఖం ఉండదు.

**శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు - సెల్ : 98485 23805**

SRI RAMANA KSHETRAM A/c. No. **6794857762**

**INDIAN BANK, VEDANGIPALEM BRANCH**

IFSC Code : **IDIB000V142, Contact No. 9866715896**

## ఆరాధన

దిII 14-04-2023న తారీఖు ప్రకారం భగవాన్ శ్రీరమణ మహర్షి వారి ఆరాధనా దినోత్సవాన్ని జరుపుకోబోతున్నాం. భగవాన్ శ్రీరమణమహర్షి దిII 14-04-1950 రాత్రి గంII 8-47 నిIIలకు అరుణాచల క్షేత్రంలో తన భౌతిక శరీరాన్ని విడిచిపెట్టారు. ఆయన మహాప్రస్థానం అరుణాచల క్షేత్రంలో ఒక దివ్యజ్యోతి ఆయన నిర్యాణపు గది గోడను ఆనుకొని పయనించి, అరుణాచల శిఖరం వైపుకు సాగి, అరుణగిరిలో ఐక్యం అవడంతో ముగిసింది. ఏబది నాలుగు సంవత్సరములు అరుణాచల క్షేత్రాన్ని కేంద్రముగా పెట్టుకొని జీవించి, తాను శాంతిగా నిష్క్రమించారు. జనన-మరణ సంసార చక్రం అనే మహావ్యాధి నుండి విడుదల పొంది, ఆత్మ సామ్రాజ్యానికి అధిపతి అయిన భగవాన్ రమణునికి చనిపోవడం అనే మాటకు అర్థం ఏముంది? పెద్ద అబద్ధం - శరీరం చనిపోవడం. ఆయన తన 17వ ఏటనే, మధురైలో అమృతానుభవాన్ని పొంది, అనగా దేహము జీవించి యుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొంది 'మృత్యుంజయుడు' అయినాడు. భగవాన్ మహానిర్వాణానికి కొద్ది రోజులు ముందు దేహము వ్యాధిగ్రస్తమైనప్పుడు కొంతమంది భక్తులు "మీ దేహం ఇంకా ఉండాలని కోరుకోండి" అనేవారు. దానికి జవాబుగా భగవాన్ "అలా కోరుకునే వాడు మధురైలోనే మరణించాడు. మీరు నన్ను దేహమాత్రునిగా భావించడం వల్ల నేను చనిపోతున్నాను అని అనుకుంటున్నారు. కానీ నేను ఎక్కడికీ వెళ్ళడం లేదు. ఎక్కడికి వెళతాను? అంతటా నిండి ఉన్నాను" అన్నారు. శరీరం త్యాగంతో ఆయన దేహగతమైన యాత్ర సమాప్తమైనదే గానీ నిజమైన ఆయన ఉనికికి మరణం లేదు. భగవాన్ శ్రీరమణమహర్షి వచ్చారు - కొంతకాలం ఉన్నారు - వెళ్ళారు అనుకుంటే అది మన పొరపాటే. మనకు ఆయన బోధ అర్థం కానట్లే. ఆయన ఎక్కడ నుండి రాలేదు, ఎక్కడికో పోలేదు. అనంతమైన ఆత్మకు రాకపోకలు లేవు. దేహము మరణించిన తరువాత మనము ఉండము అనుకుంటాం. గాఢనిద్రలో మనకు దేహం ఎక్కడ ఉంది? లేదు కదా! గాఢనిద్రలో దేహంతోటి, బంధువులతోటి, లోకము తోటి, దేవుడితోటి సంబంధం ఉందా? మరి వేటితోటి సంబంధం లేకపోయినా, నేను ఉన్నాను కదా, ఆ ఉన్న నేను ఎవరు? మనకు తెలుసున్నా, తెలియకపోయినా 'నేను' అంటే 'ఆత్మ'. ఆత్మ తానుగా, నేనుగా అనుభవంలోకి వచ్చేవరకు దుఃఖం వెంటాడుతుంది. దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందడమే నిర్వాణస్థితిని పొందడం.

**- చావలి సూర్యనారాయణమూర్తి, అమలాపురం, సెల్ : 9963195064**

# ప్రేమ లేకుండా - పరమాత్మ స్వాధీనం కాదు

అందరి హృదయాలలో పరమాత్మ ప్రకాశిస్తున్నాడు గొప్పవాడని, నీచుడు అనే తేడా లేదు. చెదరని భక్తి అంతులేని ప్రేమ కలిగి ఉంటే భగవంతుణ్ణి చేరుకోగలము. భగవంతుని ప్రేమించే వారు ఆయన సృష్టిని ప్రేమిస్తారు. ఒక వ్యక్తిని ద్వేషించటమంటే పరమాత్మను ద్వేషించటమే. ఇది ప్రేమ బాట. మినహాయింపులకూ, పక్షపాతాలకు అక్కడ తావులేదు. ఎవరైతే నీచుడని లెక్కచెయ్యక శరీర వికారాలను చూడక సిగ్గుబిడియాలు వదిలి ఆశలు, తృష్ణలను ప్రేమాగ్నిలో కాల్చుతారో వారే పూర్ణమానవులు అవుతారు. మహాత్ములంతా ఈ బాటలోనే పయనించారు. మనం ఇతరులతో ప్రేమించబడటం కాదు. మనస్వభావమే ప్రేమ మయం కావాలి అప్పడే మనం అందరినీ ఆకర్షిస్తాము. ప్రేమిచటం ఎరుగని మానవుడు భగవంతుణ్ణి ఎన్నటికీ తెలుసుకోలేడు. ప్రేమ సహాయం చెయ్యమని ప్రేరణ చేస్తుంది. మనస్సు కొలతలు వేస్తూ వ్యాఖ్యానం చేస్తుంది. "మన జీవితం ప్రేమమయమై ఉండాలి, ద్వేషాలు, అనసూయతలకు ఏ కోశానా చోటు ఇవ్వకూడదు. అప్పడు కాలం మనలను అనుసరించి తీరుతుంది. సిద్ధులన్నీ మనలను సేవిస్తాయి" అన్నారు రామతీర్థ. మనకు అత్యంత సమీపంలో ఉన్న పరమాత్మ మీద ప్రేమ లేదు. దూరాన ఉన్న బంధుమిత్రులను విశ్వాస పాత్రులమని అనిపించుకోవటానికి ప్రయత్నం చేస్తాము. ఇదే మాయ. ప్రేమ అనే మాట వినగానే మనకు కామం. అజ్ఞానం మన మనస్సుకు ఆవహించే అపార్థ దశకు చేరుకొన్నాము. ప్రేమ అంటే సమత్వ బుద్ధి అన్నింటా వాసుదేవుని దర్శించటమే. మనం గురువును స్మరించకుండా ఉండలేనప్పడు మనలను గురువు ప్రేమిస్తున్నాడని గ్రహించాలి అనే కొలబద్ధ. మనం చెడ్డ మనస్సుతో తీర్థయాత్రలకు పోయినా మన శరీరం ఒక భాగం స్నానమైనా రెండవ భాగమైన సూక్ష్మశరీరం మలినంగానే ఉంటుంది. చేదు దోసకాయను ఎన్ని నదుల్లో ముంచినా చేదు పోదు. ఇలాంటి స్నానాలు మహాత్ములకు అక్కరలేదు. మలిన మనస్సుతో ఎన్ని స్నానాలు చేసినా దొంగ దొంగే. గాంధీజీ "ప్రేమ ఉన్నచోట భగవంతుడు ఉంటాడు. ప్రేమ ఎప్పడూ ఇతరులకు ఇవ్వలేదే అని బాధపడతుంది. కోపం తెచ్చుకోదు - ప్రతీకారం తీర్చుకోదు" అన్నారు. "విశ్వ ప్రేమకు బాహ్యారూపం అహింస" అంటారు. తోటి మానవులనే కాదు మనం పశుపక్ష్యాదులను కూడా ప్రేమించాలి. ప్రేమలేని బ్రతుకు ఎడారి. ఎడారి జీవితంలో సుఖశాంతులు ఉండవు. ప్రేమ అనేది చెట్టు క్రింద ఉన్న చల్లని నీడలాంటిది. దాన్ని గురుకృపతో ఈ జన్మలోనే అనుభవంలోకి తెచ్చుకొని సుఖి అవ్వాలి.

**- సాగిరాజు రామకృష్ణంరాజు, అర్ధవరం, సెల్ : 9491968966**